ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, ఏప్రిల్ 3, 2026 | సంపుటి - 22 | సంచిక 186 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

- అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత

2

**హైదరాబాద్, నినాదం:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు.



ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు

## వేసవి సెలవులు

### అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, నినాదం:**

ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు.

2



బసిరెడ్డిపల్లిలో

## తీవ్ర విషాదం

### ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య

### చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు

**నారాయణపేట, నినాదం:**

జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

2

సంపులో పడి

## చిన్నారి మృతి



**హైదరాబాద్, నినాదం:**

నార్సింగిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గండిపేటలో ఎనిమిది నెలల పసికందు సంపులో పడి మృతి చెందింది. ఆడుకుంటూ ఇంటి బయటికి వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు సంపు దగ్గరకు వెళ్లేలోపే నీటిలో మునిగిపోయింది. సంపులో నుంచి చిన్నారిని బయటకు తీసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

2



పర్సెంటేజీల ప్రకారమే

## సినిమాల ప్రదర్శన

- నేటి నుంచే ఈ విధానం అమలు
- 23 సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎగ్జిబిటర్లకు రెవెన్యూ షేర్ ఇలా.. సినిమా ప్రదర్శితమైన తొలివారం 60 శాతం, రెండోవారం 50 శాతం, మూడోవారం

నెలాఖరుకు రెండో విడత

# ఇందిరమ్మ ఇళ్లు

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- భూభారతి పోర్టల్ ఆవిష్కరణ
- అక్రమాలకు ఇక చెక్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ

2

**రంగారెడ్డి,ఏప్రిల్2(నినాదం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు. .తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు.







రూ.122 కోట్ల

## కుంభకోణం

2

- బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగం
- 10 మంది అధికారులపై వేటు

**రాజేందర్ నగర్, ఏప్రిల్ 2 (నినాదం):**

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గత కొంతకాలంగా సాగుతున్న నిధుల దుర్వినియోగం ఉదంతం కలకలం రేపుతోంది. సుమారు రూ. 122 కోట్ల మేర ప్రభుత్వ ధనం పక్కదారి పట్టినట్లు నిర్ధారణ కావడంతో, బాధ్యులైన 10 మంది అధికారులను సస్పెండ్ చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి చిట్టా.. విజిలెన్స్ విచారణలో షాకింగ్ నిజాలు గత రెండేళ్లుగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన ఇంజనీరింగ్ పనులు, పారిశుధ్య నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణలో తేలింది.



ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, నినాదం:**

కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గరువారం అధికారులతో కలసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను రేవంత్ రెడ్డి పరిశీలించారు. చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం మళ్లిస్తే

# పీడీ యాక్టే

- రైస్ మిల్లర్లకు కలెక్టర్ వార్నింగ్
- నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం

**కాగజ్ నగర్, ఏప్రిల్ 2(నినాదం):**

***రేషన్ బియ్యం మళ్లిస్తే పీడీయాక్టుకు గురవుతారని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత రైస్ మిల్లర్లను హెచ్చరించారు. గురువారం పలువురు మిల్లర్లను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి వార్నింగ్ ఇచ్చినట్లు వినికిడి. కాగజ్ నగర్ కు చెందిన కొందరు మిల్లర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారంటూ 'నినాదం' దినపత్రికలో కొద్ది రోజులుగా వరుస కథనాలు ప్రచురితమయ్యాయి.***

ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇదే నేరానికి పాల్పడుతూ వేంపల్లికి చెందిన దుర్గాభవాని రైస్ మిల్ బాధ్యులు పోలీసులకు చిక్కారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ పై విధంగా స్పందించినట్లు సమాచారం.పేదల బియ్యం విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను సైతం ఆదేశించినట్లు తెలిసింది.



అంతా ప్రాపగండే అంటూ స్పెషల్ మీట్



అదే రాత్రి స్మగ్లింగ్

**పాపమే ఎరుగమన్నరు..**

**అదే రాత్రి పట్టబడ్డరు**

మీడియా వరుస కథనాలు,కలెక్టర్ హెచ్చరికల నేపథ్యంలో ఉక్కిరిబిక్కిరైన సదరు అక్రమ మిల్లర్లు మరికొందరిని కూడగట్టుకుని బుధవారం మధ్యాహ్నం ఓ స్పెషల్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసుకున్నారు.ఆ సమావేశంలో తాము రేషన్ బియ్యాన్ని అసలే ముడుతలేము అయినా తమని బ్లేమ్ చేస్తున్నారంటూ తమకు తాము సుద్దపూసలుగా ప్రకటించుకున్నారు.ఆపై అదే రాత్రి 9 క్వింటాళ్ల బియ్యంతో ఓ మిల్లర్ పట్టుబడ్డాడు.దీంతో సదరు ప్రత్యేక మీట్ వార్త స్థానికంగా తీవ్ర హాస్యాస్పదమయ్యింది.

కాగా ఈ తతంగానికి సలహా ఇచ్చింది కూడా వీరితో విడదీయరాని అనుబంధంగల ఓ బడా అధికారే అని తెలిసింది.

**లొసుగులతో ముగిస్తారా.. కఠినంగా వ్యవహరిస్తారా..?**

ఇది ఇలా ఉంటే బుధవారం రాత్రి పట్టుబడ్డ బియ్యాన్ని పోలీసులు స్థానిక ఠాణాకు తరలించారు. ఆ విషయమై నినాదం వివరణ కోరగా సదరు మిల్లుయజమానిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.సంబంధిత పూర్తి వివరాలు తెలిపేందుకు మాత్రం అంతగా ఆసక్తికనబరచలేదు. దీంతో మొదటినుండి ప్రభుత్వం,కలెక్టర్ చెబుతున్నట్లుగా ఈ నేరంలోని బాధ్యులపై పీడీయాక్టు ప్రయోగిస్తారా,లేక చట్టంలోని లొసుగుల ఆధారంగా 6 ఏ తో ముగిస్తారా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

కాళేశ్వరం పేరుతో

# ప్రజాధనం లూటీ

### కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం

- ఎటిఎంలా ప్రాజెక్ట్‌ను వాడుకున్న కెసిఆర్
- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్
- అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



### గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

- పంచాయతీ నిధుల విడుదలే సాక్ష్యం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

వివరాలు 2

## తెలంగాణకు కేంద్రం మొండి చేయి

- అమరావతిని సకాలంలో పూర్తి చేసి చూపాలి
- రాజ్యసభలో ఎంపి రేణుకా చౌదరి వ్యాఖ్య

2

న్యూఢిల్లీ, నినాదం: ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై రాజ్యసభలో వాడివేడిగా చర్చ జరిగింది. గురువారం నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో బిల్లుపై ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

పార్లమెంట్ సాక్షిగా

## అబద్ధాలు



- ఏడు మండలాల అప్పగింత బిజెపి పుణ్యమే
- వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

2

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు.

అమరావతికి

# ఆమోదముద్ర

- రాజ్యసభలోనూ ఏకగ్రీవం
- బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
- రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల

**న్యూఢిల్లీ,ఏప్రిల్2(నినాదం):**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది.

2

# అన్‌స్టాపబుల్ అమరావతి

- రైతులతో సిఎం చంద్రబాబు భేటీ
- జగన్ మావిగన్ వ్యాఖ్యలపై మండిపాటు
- శిలాఫలకం వద్ద సాష్టాంగ ప్రణామం

**అమరావతి,ఏప్రిల2(నినాదం):**

అమరావతి బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని చెప్పారు. అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతీ ఆంధ్రుడికీ గర్వకారణమన్నారు. అమరావతి ప్రస్థానంలో ప్రతి అడుగులో ప్రధాని మోదీ అండగా నిలిచారని తెలిపారు. రాజధాని రైతులు చేసిన త్యాగం, చూపిన పట్టుదల మరువలేనివని, ఈ విజయం వారికే అంకితమన్నారు. అమరావతే ఇక ఆంధ్రులకు ఏకైక ప్రజా రాజధాని అని చెప్పారు.



# రూ. 122 కోట్ల కుంభకోణం

**ప్రధాన ఆరోపణలు ఇవే:**

కౌన్సిల్ అనుమతి లేకుండానే: నిబంధనల ప్రకారం కౌన్సిల్ ఆమోదం పొందకుండానే నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేయడం.
నిధుల మళ్లింపు: పనుల పేరుతో నిధులను పక్కదారి పట్టించడం.
రికార్డుల మాయం: అవినీతి బయటపడకుండా ఉండేందుకు కార్యాలయ రికార్డులను తారుమారు చేయడం మాయం చేయడం.

**సస్పెన్షన్‌కు గురైన అధికారులు ..**

ఈ అక్రమాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ కమిషనర్లు, ఇంజనీర్లు ఆడిట్ అధికారులపై వేటు పడింది. పి. సరస్వతి మాజీ కమిషనర్, ప్రస్తుతం సర్కిల్–16 డిప్యూటీ కమిషనర్,జి. రఘు మాజీ మున్సిపల్ కమిషనర్, జ్యోతి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వెంకన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వై. యాదగిరి శానిటరీ ఇన్‌స్పెక్టర్, డి నాగేశ్వరరావు ఏఎంసి, వీరితో పాటు మరికొందరు ఆడిట్ అధికారులు, ఇతర సిబ్బందిని ప్రభుత్వం తక్షణమే విధుల్లో నుంచి తొలగించింది. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినా, నిబంధనలను అతిక్రమించినా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.ఈ చర్య ద్వారా ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కొనసాగుతుందని తెలిపారు.

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

### ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు
## వేసవి సెలవులు

విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

## బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం

నారాయణపేట జిల్లా బసిరెడ్డిపల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. దాంతో అవ్వా తాత.. చిన్నారి తేజశ్రీని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మరోవైపు చిన్నారి తేజశ్రీ కూడా అవ్వా, తాత దగ్గర బాగానే పెరుగుతోంది. రోజూ అంగన్‌వాడీకి వెళ్లడం.. తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. అంతా బాగుంది అనుకున్న తరుణంలో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో ఆరుబయట నిద్రించడం ఆనవాయితీ. రాత్రి అవ్వ తాతతో కలిసి తేజశ్రీ బయట నిద్రించింది. కానీ అర్ధరాత్రి సమయంలో అమ్మాయి వారి పక్కలో లేకపోవడంతో వృద్ధ దంపతులు కంగారు పడ్డారు. గ్రామస్థుల సహాయంతో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన గ్రామస్తులు హుటాహుటిన నారాయణపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసు జాగిలాలతో సంఘటన స్థలాన్ని పరీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

## నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం అన్నారు.

### అక్రమాలకు ఇక చెక్

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా ప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.

## సంపులో పడి చిన్నారి మృతి

అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీగా విలపించారు. పొట్ట చేత పట్టుకుని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు.. గండిపేటలో జీవనం సాగిస్తున్నారు. అప్పటి వరకు ఆడుకుంటున్న తమ చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

40 శాతం. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటన విడుదల చేసింది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఇటీవల సంప్రదించి.. తెలంగాణలోని పలువురు అగ్ర శ్రేణి డిస్ట్రిబ్యూటర్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి థియేటర్లు ముఖ్యమైన ప్రదేశాల్లో ఉన్న ప్రీమియం థియేటర్లని, వాటిలో ప్రేక్షకులకు అన్ని సౌకర్యాలున్నాయని, అయితే ఈ థియేటర్ల నిర్వహణకు చాలా ఖర్చవుతోందన్నారు. ప్రస్తుత అద్దె విధానంతో వారు మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శిస్తామన్న తమ ప్రపోజల్‌ను డిస్ట్రిబ్యూటర్లు అంగీకరించారని చెప్పారు. శశిధర్ రెడ్డి మాత్రమే నిర్మాతలు, ఇతర భాగస్వాములతో మరింత చర్చించి, ఆ తర్వాత అభిప్రాయం చెబుతామన్నారని పేర్కొన్నారు. ఇకపై తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో సినిమాలను కేవలం శాతం ప్రాతిపదికనే ప్రదర్శిస్తామని, ఇది విడతల వారీగా జరుగుతుందని ఎగ్జిబిటర్లు తెలిపారని ఫిల్మ్ ఛాంబర్ ప్రకటనలో పేర్కొంది. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత ఎగ్జిబిటర్ల సమావేశం లోనూ దీనిపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మన తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల సింగిల్ స్క్రీన్‌లు పర్సంటేజీ విధానాన్ని మాత్రమే అనుసరిస్తున్నాయి. సింగిల్ స్క్రీన్‌ల మనుగడ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని డిస్ట్రిబ్యూటర్లు, సినీ నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. రెంటల్ విధానానికి బదులు పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన కోసం ఎప్పటి నుంచో ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 23 థియేటర్ల యాజమాన్యాలు ముందడుగు వేశాయి.



# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్2(నినాదం):**

రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాలేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పని కిరాకుండా పోవడానికి బీఆరఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

## గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025`26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రావిణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.తాజాగా 2025`26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026`27 నుంచి 2030`31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023`24, 2024`25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.



ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025`26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆరఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రెండేళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటూ ప్రకటన జారీ చేశారు.

# పార్లమెంట్ సాక్షిగా అబద్ధాలు

రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్‌లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బీజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాలేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు. క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజాధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యనించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని, దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే ' అని వెల్లడించడం మీ కళ్ళకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీష్‌రావు విమరించారు.8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని రిప్రెజెంట్ చేయకుండా సప్రెస్ చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.



## తెలంగాణకు కేంద్రం మొండి చేయి

**న్యూఢిల్లీ, నినాదం:**

ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై రాజ్యసభలో వాడివేడిగా చర్చ జరిగింది. గురువారం నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో బిల్లుపై ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పెట్టరా పేరు అమరావతి.. పిలవరా కమరావతి అని... గతంలోనే మాజీ సీఎం జగన్ కు చెప్పానని అన్నారు. 12ఏళ్ళ తర్వాత ఈ బిల్లు సభకు రావడం బాధాకరమని..పాలసీ పెరలాసిస్ కారణంగా ఏపీ 12 ఏళ్ళు నష్టపోయిందని అన్నారు. ఇది అమరావతి రైతుల విజయమని..ఎంత వేధించినా రైతుల నిరసన ఆగలేదని అన్నారు. అమరావతికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని రేణుక చౌదరి అన్నారు. విభజన హామీలు 12 ఏళ్ళ పాటు విస్మరించారని.. దుగ్గరాజపట్నం, కడప స్టీల్ ప్లాంట్ ను ముగిసిన అధ్యాయం చేశారని అన్నారు.బిల్లు పెట్టడం కాదు.. సమయానికి అమలు చేసి చూపించాలని అన్నారు. ఏపీ తెలంగాణ మధ్య రూ. లక్షా 47 వెల కోట్ల ఆస్తుల పంపకాలు జరగలేదని అన్నారు. రెండు రాష్ట్రాలతో కేంద్రం ఆటలు ఆడుకుంటోందని అన్నారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోలేదని..రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కూడా ఇవ్వలేదని అన్నారు . రాజకీయ అవసరాల కోసమే ఏపీకి విభజన హామీలు అమలు చేస్తున్నారని.. తెలంగాణకు మాత్రం మొండి చెయ్యి చూపిస్తున్నారని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

**సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల**

హైదరాబాద్ :ప్రజా పాలన` ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి . సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం.ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు వి[illegible] ఆమోదం, మద్దతు ప్రకటించారు. వి[illegible]రు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన` ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

## ట్రాఫిక్ జంఝాటంపై పోలీసుల సర్వే

**వ్యక్తిగత వాహనాల వల్లనే రద్దీ - గ్రూప్ ప్రయాణాలతో రద్దీ తగ్గుతుందని వెల్లడి**

హైదరాబాద్ : ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 అధికంగా ఉండటం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని ఈ సర్వేలో స్పష్టమైంది. ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం వృథా కావడంతో పాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల రిస్క్, శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనికి తోడు వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

# అమరావతికి ఆమోదముద్ర

ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఎపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లు పై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆరఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాజధాని అమరావతి బిల్లును ఇటీవల కేంద్రానికి పంపారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందడంతో.. రాజ్యసభకు పంపారు. ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలు ఆమోదం పొందడంతో.. ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపనున్నారు.

## అన్‌స్టాపబుల్ అమరావతి

అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై ఉద్దండరాయునిపాలెంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సతీసమేతంగా వెళ్లిన సీఎం చంద్రబాబుకు అక్కడి రైతులు, మహిళలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఉద్దండ



రాయునిపాలెంలో శంకుస్థాపన శిలాఫలకాన్ని సీఎం పరిశీలించారు. అమరావతిలో పవిత్ర నీరు, మట్టి ప్రదేశం వద్ద చంద్రబాబు మోకరిల్లారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అమరావతికి వచ్చింది తాత్కాలిక ఇబ్బందులేనని, ఇక అపజయం లేదని అన్నారు. రైతుల ఐకమత్యమే అమరావతిని గెలిపించింది. ప్రపంచంలోనే ఉత్తమ రాజధానిగా అమరావతిని తయారు చేస్తాం. తెలుగు జాతి గౌరవం, గుండె అమరావతి. వైకాపాకి ఇంకా జ్ఞానోదయం కలగలేదు. వైకాపా పీడ రాష్ట్రానికి విరగడ కావాల్సి ఉందన్నారు.. మావిగన్ అంటూ జగన్ కొత్త పదం తీసుకొచ్చారు. మావిగన్ అంటే ఏంటో డిక్షనరీలో చూశాను. నాకెక్కడా దాని అర్థం దొరకలేదు. అమరావతిని చంపాలనుకున్న వైకాపా.. బాగుపడే సమస్యే లేదు. వాకౌట్ చేసిన వైకాపాను.. ప్రజలు బ్లాకౌట్ చేయాలి. వైకాపా చేసినంత నీతిమాలిన రాజకీయం ఎప్పుడూ చూడలేదు. అమరావతి, విశాఖ, తిరుపతి ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా మాట ఇస్తున్నా. అమరావతి ఇక అన్‌స్టాపబుల్.. అజరామరం అంటూ ప్రకటించారు. అమరావతికి ఘనమైన చరిత్ర ఉంది. వైకాపా మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ బిల్లుకు మద్దతిచ్చాయి. అమరావతితో నాకు చాలా ఎమోషన్ ఉంది. కుట్రలు, విధ్వంసకర పరిస్థితులను ఎదుర్కొని రాజధాని సంపాదించుకున్నాం. జగన్ మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడారు. రాజధానికి 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. కుట్రలు, విధ్వంసకర పరిస్థితుల్లో రాజధాని సంపాదించుకున్నాం. అమరావతికి గెలుపే తెలుసు.. ఓటమి అంటే ఏమిటో తెలియదు. వి ఐకమత్యంతో రాజధానిని గెలుచుకున్నాం. అమరావతి చరిత్రలో వి ప్రతాపం, పట్టుదల చూపించారు. చరిత్ర ఉన్నంతవరకు అమరావతి ఉంటుందని చంద్రబాబు అన్నారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT SECUNDERABAD
O.S. No.1004 OF 2022

Between:
State Bank of India, Market Street Branch,Hyderabad.
... Plaintiff
And:
Smt. Doodi Shanthi
... Defendant

To
Smt. Doodi Shanthi W/o Late Doodi Shankar Major Occ: House Wife, H.No.8-2-293/82/G, Gyani Jailsingh Nagar,Filmnagar, Jublihills, Shaikpet, Hyderabad – 500 003.

Please take notice that as you are evading to taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 22-04-2026 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT. RAPAKA ARUNA,
B.A, B.L.,
Advocate11-78,
Flat No.203, Sri Sai Manssion,
Pragathinagar,
Gaddiannaram,
Hyderabad–60.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIVADDL JMFC AT: HAYATHNAGAR
O.S.No. 190 OF 2026

BETWEEN:
1.Arikeri Anand Kumar another
...Plaintiffs
AND
1.All concerned
2.The Mandal Tahasildhar officer Abdullapurment Having office at Abdullapurment village & Mandal. R.R Dist .Telangana.

Sirs,
Whereas the above-named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs ofLate Smt Arikeri Sarojini, and Late Arikeri Ayyappa. Therefore, all concerned are hereby requested to appear before the Hon'ble court at 10.30 A.M. on 29-04-2026 either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise, the matter will be heard and decided exparte in your absence.

SCHEDULE PROPERTY
All that the piece and parcel property plot No.44, in survey No.s 407,408, and 412, Admeasuring300 Sq.Yardsar situated at PASMAMLA Village, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, SRO Hayathnagar east Telangana State. bounded by:-

BOUNDARIES FOR PLOT
NORTH:Plot 35.
SOUTH: 30 Feet Wide Road
EAST:: Plot 43.
WEST:: Plot No.45

By order of the court
(Bumanandham Ganji)
ADVOCATE,
Hayathnagar, Hyd.
Ph: 9392552949

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTAT: SECUNDERABAD
O.S.No.182 OF 2026

Between:-
1. Juluru Ashok Kumar s/o Late Sri J.Babaiah Aged 71 years, Occupation: Retd Employee Resident of H.No. 1-4-180 C-14/1, BHEL MIG Colony, Opp Loyala Degree College, Old Alwal Hyderabad-500010.
2. Julluru Uma Mahesh s/o J.Ashok Kumar, aged 46 years, Occupation: Pvt Service,Aged 52 years, Occupation: Pvt service, resident of 6-6-36/2, Kavadiguda, Chitrala Compound, Secunderabad.
3. Juluru Madhusudhan s/o Juluru Ashok Kumar, aged 40 Years, Occupation: Pvt service, resident of H.No. 1-4-180 C-14/1, BHEL MIG Colony, Opp Loyala DegreeCollege, Old Alwal, Hyderabad-500010.
....Plaintiffs
AND
1. The Thasildhar Musheerabad Mandal
2. All Concerned
....Defendants

To,
All Concerned
Please take notice that Plaintiffs filed the above suit against you for declaring them as the legal heirs of deceased Smt J.Chandrakumari alias Chandrakala and Late Smt J.Anasuya alias Anasuyamma before the Hon'ble Court and the same is posted for your appearance on 17.04.2026. If any person or persons have objections may appear before the Hon'ble Court either in person or through an Advocate on the said date. If you fail to appear in person or through Advocate, the same will be decided exparte.

By Order of Court
Sd/- Srinivas Bazar Advocate H.No 10-5-74/1, Tukaramgate, North Lalaguda, Secunderabad.
9848280996

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE cum II ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: MEDCHAL-MALKAJGIRI DISTRICT; AT : KUSHAIGUDA
O.S.NO. 137 OF 2026

Between:
R.Srinivasa Rao & others
....Plaintiffs
AND
The Tahsildar Keesara and Another
.....Defendants

To,
All Concerned
Please take notice that the Plaintiffs herein have filed the above suit for Declaration of Plaintiffs as the legal heirs of LATE.ROBBI KALPANA before the Hon'ble II Additional Junior Civil Judge Cum II Addl Judicial Magistrate of First Class, Medchal-Malkajgiri District, at Kushiaguda.

Therefore, the General Public are hereby informed that if any person or persons have got any objection or interest should appear and file the same before the above said Hon'ble Court on 21.04.2026 at 10.30 A.M through counsel or in person failing which the matter will decided on merits.

// BY ORDER OF THE COURT //
Sd/-
D.SHIVA KUMAR GOUD
Advocate
Flat No: 595A, Eastern part, First Floor, Weavers Colony, Bhavana Nagar, Hyderabad, Telangana. 500062
Contact No: -9849147081

# విద్యార్థులకు గ్రంథాలయం ఎంతో ఉపయోగం

- జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శేరి రాజేష్ రెడ్డి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



**కొడంగల్, ఏప్రిల్ 02 (నినాదం):** విద్యార్థులకు లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందనీ, లైబ్రరీ లలో చదువుకున్న చాలామంది తమ లక్షాలను సాధించుకున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శేరి రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన వార్షికోత్సవం కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అబ్బురపరిచాయి. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కళాశాల అధ్యాపకుల పనితీరును అభినందించారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న అన్నీ రకాల వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుంటుందని, తన వంతు కృషి ని అందిస్తానని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్, బి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,2008 లో కొడంగల్ లో కొద్ది మంది విద్యార్థుల తో ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేడు జిల్లాలో అగ్రగామిగా నిలిచిందన్నారు.గత సంవత్సరం బిఎస్సి, ఎంపిసి గ్రూప్‌లు తెలుగు మీడియంలో ప్రారంభించామని ఈ సంవత్సరం లో బిఎస్సి హెల్త్ కేర్ కోర్సు ను నూతనంగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. వివిధ స్థాయిలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం ఐదువేల రూపాయల నగదును బిఎ, బిఎస్సి, బి.కామ్ సబ్జెక్టు లలో టాపర్ గా నిలిచిన విజయలక్ష్మి, కృష్ణ, ప్రమీల అనే ముగ్గురు విద్యార్థులకు అందించారు. అంతేకాకుండా మహ్మదీబేగం మెమోరియల్ అవార్డుగా 5 వేల రూపాయలు బాటనీ టాపర్‌గా నిలిచిన శివనీల, మహ మ్మద్ సిద్దిక్ అహ్మద్ మెమోరియల్ అవార్డుగా 5 వేల రూపాయల నగదును నవీనలకు కళాశాల అదనపు ప్రిన్సిపాల్ రఫియా ఖానం అందించారు. ఈ కార్యక్రమ ంలో ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్, ఆర్.శ్రీనివాస్, గేమ్స్ మరియు స్పోర్ట్స్ ఇంఛార్జిడా శ్రీధర్ కుమార్,డాక్టర్ కె.రమేష్ బాబు, ఇ.సోమ్లా, హరిప్రియ పాల్గొన్నారు.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఇంతకుముందు మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U65923K12010PIC0039179, రిజిస్టర్డ్ ఆఫీస్: 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చెర్ప్పు- త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567

## డిమాండ్ నోటీసు

భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారిచే జారీ చేయబడిన నోటిఫికేషన్ నెం. S.O. 3466 (E) తేది: 18 డిసెంబర్, 2015తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట చట్టముగా వ్యవహరించబడును) లోని సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్(1)లోని క్లాజ్ (m)లో సబ్-క్లాజ్ (iv) పరిధిలో ఆర్థిక సంస్థగా మరియు కంపెనీల చట్టము 1956 క్రింద నమోదైన కంపెనీగా భారత దేశములోని వివిధ ప్రదేశాల వద్ద బ్రాంచ్‌లు మరియు నమోదిత కార్యాలయము, 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చెర్ప్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567. మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకమీదట "MAHOFIN"గా వ్యవహరించబడును) వారి అధీకృత అధికారి ఇతర విషయాలతో పాటు నివాస యూనిట్‌ల కొనుగోలు మరియు/లేదా నిర్మాణం కొరకు ముందస్తు రుణముల యొక్క వ్యాపారమును చేపట్టినారు. దిగువ తెలిపిన చార్టులోని కాలమ్ నెం.2లో తెలిపిన విధముగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు MAHOFIN నుండి రుణమును పొందినారు. SARFAESI చట్టము క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన MAHOFN సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 2తో చదువబడు సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ నోటీస్‌లలో తెలిపిన మొత్తము మరియు దానిపై తదుపరి వడ్డీతో సదరు నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీస్ జారీ చేసినారు. కానీ నోటీస్‌లు వివిధ కారణముల వలన వారిలోని కొందరికి అందజేయబడలేదు. అదనముగా దిగువ తెలిపిన సదరు రుణగ్రహీతల సమాచార ప్రయోజనార్థం కొరకు సదరు రుణగ్రహీతలకు ఈ బహిరంగ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత పేరు/ LAN/ బ్రాంచ్ | ఇంటరెస్ట్ కల్పించబడిన వాటికి సంబంధించి సెక్యూర్డ్ ఆస్తుల వివరణ | ఎన్‌పిఎ తేది | నోటీస్ పంపిన తేది & బకాయి మొత్తం |
|---|---|---|---|---|
| 1 | అఫ్రీన్ ఫాతిమా, సయ్యద్ రషీద్/ MLAP0148038269/ రామగిరి | తెలంగాణ, పిన్-508001, అసెస్‌మెంట్ నెం. 1042043909, నల్గొండ జిల్లా, నల్గొండ టౌన్, ఖాజాఖౌలి దగ్గర, బ్లాక్ నెం. 3, వార్డు నెం. 3, సర్వే నెం. 848లోని ఇ.నెం. 3-3-36/2లోని నిర్మాణాలతో సైట్, 2 సంవత్సరాల వయస్సు గల భవనము, ఆర్‌సిసి రూఫ్‌తో 312-00 చ.అ.ల ప్లింత్ ఏరియా (202.00 చ.గ.లలో) 102.00 చ.గ.లు = 85.28 చ.మీ.ల విస్తీర్ణము. సరిహద్దులు: తూర్పు: అంజద్ ఖాన్ ప్లాట్‌లోని భాగము, పడమర: సయ్యద్ ఖైరుద్దీన్ ప్లాట్, దక్షిణం: 30' వెడల్పు రోడ్డు, ఉత్తరం: మల్లార్ ఇల్లు. | 28-02-2026 | 06-03-2026 & Rs.414128/- |
| 2 | బొబ్బిలి భాస్కర్, బొబ్బిలి గంగ శంకర్, మాస్టర్ శ్రీకాంత్/ NLAP0111013555/ తిరుమల టాకీస్ క్రాస్ రోడ్డు | తెలంగాణ, పిన్ 503202, రిజిస్ట్రేషన్ జిల్లా నిజామాబాద్ మరియు రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా బోధన్ క్రింద నిజామాబాద్ జిల్లా, యడపల్లి మండలం, థానకలాన్ గ్రామ పంచాయితీ పరిధిలో థానకలాన్ గ్రామం వద్ద 2898.00 చ.అ.లు లేదా 322.00 చ.గ.ల మొత్తం విస్తీర్ణము జిపి నెం. 4-109/164/9 (అసెస్‌మెంట్ నెం. 992) గల ఖాళీ ప్రదేశము. సరిహద్దులు: తూర్పు: ఆర్‌&బి రోడ్డు, పడమర: కొనుగోలుదారు ఖాళీ ప్రదేశము, తరువాత కెనాల్, దక్షిణం: గంగా శంకర్ ఖాళీప్రదేశము, ఉత్తరం: బి. మల్లేశం ఖాళీప్రదేశము. | 28-02-2026 | 06-03-2026 & Rs.268828/- |
| 3 | మేత్రం విజయ్ కుమార్, మేత్రం ప్రీతి, కంజర్ల లక్ష్మణ్ కుమార్/ NLAP0111011556/ తిరుమల టాకీస్ క్రాస్ రోడ్డు | తెలంగాణ, పిన్ 503230, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా నిజామాబాద్, ముదకపల్లి గ్రామంలోని గ్రామ పంచాయితీ పరిధిలో నిజామాబాద్ జిల్లా, ముగుపాల్ మండలం, ముదకపల్లి గ్రామం వద్ద జిపి నెం. (3-56) గల ఖాళీ ప్రదేశముతో ప్రస్తుతమున్న ఎంటి మరియు టిన్ షీట్ రూఫ్ ఇల్లు. మొత్తం ప్లింత్ ఏరియా 133.33 చ.గ.లు లేదా 111.47 చ.మీ.లు. సరిహద్దులు: తూర్పు: కెనాల్, పడమర: పట్ల సాయిలు మరియు పోతన్న ఇల్లు మరియు 10'-0" కామన్ స్పేస్ తరువాత జిపి రోడ్డు, దక్షిణం: పట్ల సుధాకర్ ఇల్లు, ఉత్తరం: కాంతి సాయన్న ఖాళీ ప్రదేశము. | 28-02-2026 | 06-03-2026 & Rs.267347/- |
| 4 | గుండ్ల సురేష్, గుండ్ల లక్ష్మి, కర్రి అంజీవరావు/ NHL01110009875/ తిరుమల టాకీస్ క్రాస్ రోడ్డు | తెలంగాణ, పిన్ 507002, ఖమ్మం, ఖమ్మం (అర్బన్) రామాలయం దగ్గర, ఖమ్మం మండలం, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో, కొత్తగూడెం (గ్రామం), ఇ.నెం. 19-1-53 (పాత నెం. 1-53) భాగము ఖాళీ సైట్‌పై నిర్మాణాలతో 194.75 చ.గ.ల విస్తీర్ణపు సైట్. సరిహద్దులు: తూర్పు : కె. వరదయ్య ఇల్లు, పడమర: దాత ఇ.నెం. 19-1-53లోని భాగము, దక్షిణం: కె. లక్ష్మయ్య ఇల్లు, ఉత్తరం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు. | 28-02-2026 | 06-03-2026 & Rs.257083/- |

కావున ఈ నోటీస్ ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ నోటీస్ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీతకు వ్యతిరేకముగా పైన చూపించిన విధముగా రావల్సిన పూర్తి బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించమని పైన తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరడమైనది. పూర్తి బకాయి మొత్తము మరియు తదుపరి వడ్డీతో సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత చెల్లింపులో విఫలమైతే, MAHOFIN వారు పైన తెలిపిన విధముగా ఆస్తులపై సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చేయుట కొరకు సెక్షన్ 13(4) క్రింద ముందుకు సాగెదరు, చట్టము మరియు అందులో ఏర్పడిన రూల్స్ క్రింద పేర్కొన్న విధముగా ఇతర పద్ధతులలో నోటీస్ సర్వీస్ కొరకు చర్యలు తీసుకొనబడును. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(8)లో వివరించిన విధముగా అమ్మకం రూపములో బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందం లేదా బహిరంగ వేలం కొరకు నోటీస్ ప్రచురణ తేదిలోగా ఏ సమయంలోనైనా పూర్తి బకాయి మొత్తము మరియు వ్యయాలు, చార్జీలు, ధరలు & MAHOFIN వారిచే వెచ్చించిన ఖర్చులతో మీరు చెల్లించినచో సదరు తనఖాను విడిపించుకొనగలరని మీకు ఈ నోటీస్ ద్వారా తెలియజేయడమైనది. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(13) ప్రకారం అమ్మకం, లీజు లేదా వేరే ఇతర పద్ధతులలో సెక్యూర్డ్ ఆస్తులను బదిలీ చేయుట మరియు/లేదా వ్యవహరించుట నుండి మీరు నిషేధించబడినారని గమనించగలరు.

తేది: 03.04.2026, ప్రదేశం: తెలంగాణ
సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

# ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికి చేరడానికే గ్రామసభలు





- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్, ఏప్రిల్ 2(నినాదం):** ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ప్రజలందరికి చేరాలనే సంకల్పంతో 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సీ ఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టినట్లు తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం మోమిన్ పేట మండలం బూర్గుపల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భం గా ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైయ్యాక అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను మీకు వివరించడంతో పాటుగా ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించడంలో ఈ కార్యక్రమం సహకరించనుందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకంలో అక్కా చెల్లెల్లకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించామన్నారు. ఇప్పటి వరకు మహిళలు పదివేల కోట్ల రూపాయల ప్రయాణాలు చేశారని చెప్పారు. 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలెండర్, గృహజ్యోతి పథకంలో పేదల ఇళ్ళకు ఉచిత కరంటు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పది లక్షలకు పెంపు కల్పించామన్నారు. ఈ ఏడాది నుండి రాష్ట్రంలోని కుటుంబాలన్నింటికి భరోసా ఉండాలనే ఉద్యేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రారంభించనున్నట్లు చెప్పారు. బడికి వెళ్ళే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, ఆకలితో అలమటించకూడదని ఉద్యేశంతో ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉదయం పూట అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అదేవిదంగా ఇంటర్ మీడియట్ విద్యార్థులకు కూడా మద్యాహ్న భోజన సౌకర్యాన్ని అందిస్తున్నారని అన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏలాంటి అభివృద్ధి చేసింది అనేది ప్రజలకు తెలుసని ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిందని ఆరోపించారు. ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఖజానాలో రూపాయి లేని దుస్థితి ఉందని అన్నారు. అప్పటి ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రం వెనుకబడిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చే వరకు గత ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో అప్పులు చేసిన విషయం తెలియదని ప్రస్తుతం నెలకు 6,500 కోట్ల రూపాయలు అప్పు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థుడు కాబట్టి ఈ అప్పులను తీర్చుతూ మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తున్నాడని కొనియాడారు. రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ జరిగిందని, సంపన్నులే కాదు పేదలు ప్రభుత్వ నిర్ణయంతో కూడా సన్న బియ్యం అన్నం తింటున్నారని అన్నారు. పదేళ్ల తర్వాత రేషన్ కార్డులు అందిస్తున్న ఘనత ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. అదేవిధంగా పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేసి గూడు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వర్గీయ రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన విదంగా గ్రామంలో ఇళ్ళు లేని అందరికీ ఇందిరమ్మ ఇళ్లు స్తున్నామని స్వంత స్థలం లేకపోతే స్థలం ఇచ్చి ఇళ్ళు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని,ప్రవేటు రంగంలో 15 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు లేకపోతే ప్రభుత్వం ఆడపడుచులకు తులం బంగారం కూడా వచ్చేదనిఅన్నారు. మహిళలకు నెలకు 2,500 రూపాయలు అందించేవారమని, ఫింఛన్లు పెరిగేవని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళలకు ఇచ్చిన హామీ మేరకు 2500 రూపాయలు ఇయ్యకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగమని స్పీకర్ శ పథం చేశారు. త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు కానున్నాయని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ళలో ఒక్క రోడ్డు నిర్మించలేదని ఇప్పటికే 600 కోట్లతో రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో 50 లక్షలతో సిసి రోడ్లు వేయించామని అన్నారు. స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి అధిక నిధులు, 5000 ఇందిరమ్మ ఇళ్ళు వచ్చాయని అందరికీ ఇస్తామని అన్నారు. వికారాబాద్ ప్రాంతానికి నీళ్ళు రాకుండా గత ప్రభుత్వ పెద్దలు అడ్డం పడ్డారని . ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలను ఆపారని ప్రస్తుతం ముఖ్యమంత్రి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి వికారాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించనున్నట్లు చెప్పారు. వేసవిలో గ్రామాలలో నీటి ఎద్దడి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామంలో స్మశానవాటికకు వెళ్ళడానికి రోడ్డు అడిగారు, వెంటనే మంజూరు చేస్తున్నానని తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్ పల్లి మండలం మోత్కుపల్లి గ్రామానికి ఉత్తమ గ్రామంగా జాతీయ అవార్డు వచ్చిందని . యాబై లక్షల నగదు బహుమతి కూడా ఇచ్చారని చెప్పారు. మోత్కుపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామాలు కూడా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ రివారి, ఆర్డివో వాసుచంద్ర, డిపివో జయసుధ, డీఏవో రాజరత్నం, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# రైతు పక్షాన నిలబడితే.. కక్షసాధింపు అంటారా.?

- కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎవరిని కూడా వ్యక్తిగతంగా విమర్శించలేదు
- కొల్చారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్



**కొల్చారం, ఏప్రిల్ 2 (నినాదం):** సింగూర్ ప్రాజెక్టు నుండి ఘనాపూర్ ఆయకట్టుకు నీటి విడుదలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని ఎవరిని కూడా వ్యక్తిగతంగా మా ఎమ్మెల్యే దూషించలేదు. గతంలో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగూరు ప్రాజెక్టులో 0.75 టీఎంసీ నీరు ఉన్నప్పుడు ఘనాపూర్ ఆయకట్టు రైతుల కోసం 0.20 టీఎంసీల నీటిని విడుదల చేసిన సందర్భాన్ని గుర్తు చేసినారు. మా ఎమ్మెల్యే ఘనాపూర్ ఆయకట్టుకు నీళ్ల విడుదల విషయంపై అసెంబ్లీ నందు మరియు తెలంగాణ రాష్ట్ర మంత్రుల దగ్గరకు వెళ్లి నీళ్ల విడుదలకై ప్రయత్నం చేసిన మాట వాస్తవం కాదా! నీటి విడుదల కోసం 23న జీవో ఇచ్చిన విషయం తెలుసుకొని మేము కూడా రైతు కుటుంబంలో నుండి వచ్చిన వారం కాబట్టి రైతుల పక్షాన సంతోషం వ్యక్తం చేసిన మాట నిజం. మేము టిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రెస్ మీట్ పెట్టి సంతోష పడినందుకు నీళ్ల విడుదల ఆగిపోయిందా కాంగ్రెస్ పార్టీ నాయకులే సమాధానం చెప్పవలసి ఉంది. తేదీ 23-3-2026 నాడు నీటి విడుదలకై జీవో ఇష్యూ చేస్తే ఈ రోజు వరకు కూడా నీటి విడుదల కాలేదు. ఇట్టి విషయంపై అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులే ఆలోచించాలి. అస్తమానం రైతు ప్రభుత్వం అని చెప్పే పార్టీ రైతు బోనస్ విషయంలో వరి పండించిన రైతులకు ప్రతి క్వింటాల్కు 500 రూపాయలు బోనాసిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని మాట మార్చినది నిజం కాదా! అంతేకాకుండా వానాకాలంలో పండించిన వరి పంటకు బోనస్ ఇచ్చి యాసాంగిలో పండించిన వడ్లకు బోనస్ ఇవ్వనిది నిజం కాదా! రైతు బంధు విషయంలో ఎకరాకు 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు ఎగ్గొట్టి ఎకరాకు 12 వేల రూపాయలు ఇచ్చి ఈసారి ఒక ఎకరం పంటకు మాత్రమే 6000 రూపాయలు రైతు భరోసా ఇచ్చిన మాట నిజం కాదా అని టిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రశ్నిస్తున్నాం. టిఆర్ఎస్ పార్టీ అంటేనే ఉద్యమాల్లో నుండి వచ్చిన పార్టీ ఎవరి బెదిరింపులకు గాని ఎవరి హెచ్చరికలకు గాని భయపడే పార్టీ కాదని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న గౌడ్

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ అరవై గజాలు - తెలుగు తల్లి నగర్ లో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ మహా వీరుడు, సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. సర్వాయి పాపన్న అన్యాయానికి ఎదురు నిలబడి సామాన్య ప్రజల స్వేచ్ఛ, గౌరవం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహానుభావుడని కొనియాడారు. ఆయన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వివరించారు.ఈ కార్యక్రమంలో కౌండిన్య మహాముని సంఘం అధ్యక్షులు ఎంఎస్.గౌడ్, సభ్యులు రాజు గౌడ్, రమణ, జి. హెచ్. రాజు, పవన్, వెంకటేష్, సుబ్బా రావు, కరాటే శ్రీను, శ్రీను, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, బలరాం రెడ్డి, కోలా శ్రీకాంత్, రాజ్ కుమార్, గుబ్బల లక్ష్మీ నారాయణ, సత్యనారాయణ గౌడ్, తారా సింగ్ పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చకుండా
# వార్డు సభలు ఏర్పాటు

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి



**సిద్దిపేట, ఏప్రిల్ 02(నినాదం):** సిద్దిపేట పట్టణ కేంద్రంలోని పలు వార్డులలో పట్టణ ప్రణాళిక లో భాగంగా నాలుగవ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫోటో లేదని బిఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీని చింపేశారు. బిఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ ఆధ్వర్యంలో వార్డు సభను బైకాట్ చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండ సంపత్ రెడ్డి మాట్లాడుతూ వార్డు సభలో కాంగ్రెస్ కార్యకర్తలు స్టేజీ పై ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ల ఫోటోలు లేకుండా ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేసారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వార్డు సభలు ఏర్పాటు చేయడం విడ్డురం అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని ప్రజలు మెచ్చే పాలన కొనసాగించాలని సూచించారు.

# జహంగీర్ మరణం సమాజానికి తీరనిలోటు

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



**దుబ్బాక, ఏప్రిల్ 2(నినాదం):** ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్నే అంకితం చేసిన ప్రజా కళాకారుడు తుర్కపల్లి జహంగీర్ అకాల మరణం సమాజానికి తీరని లోటని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్, రజక సంఘం రాష్ట్ర నాయకులు ముత్యాల నర్సింలు, సోషల్ రిఫార్మేషన్ కోశాధికారి మహమ్మద్ ఉమర్, పుట్ట రాజు అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రజా కళాకారుడు మహమ్మద్ జహంగీర్ పార్థివదేహానికి నివాళి అర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం తన కళను ఆయుధంగా మలుచుకుని జీవితాంతం పోరాడిన అరుదైన వ్యక్తిత్వం జహంగీర్ దని కొనియాడారు.దోపిడి, పీడనలేని సమసమాజ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకుని తన ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించిన మహోన్నత కళాకారుడు జాంగిర్ అని ఆయన గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను వెలికి తీసి, వాటి పరిష్కారానికి కళారూపాల ద్వారా అవగాహన కల్పించడంలో ఆయన చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు.నిత్య నిర్బంధ పరిస్థితులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ప్రజల గొంతుకగా నిలిచి, అన్యాయాలకు వ్యతిరేకంగా గళమెత్తిన ధైర్యవంతుడు జహంగీర్ అని అన్నారు. ముఖ్యంగా మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో గజ్వేల్ ప్రాంతంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైందని, ఉద్యమానికి ఊపిరి పోసేలా పనిచేశాడని తెలిపారు. జహంగీర్ ఆత్మీయతకు మారుపేరుగా నిలిచాడని, ఎవరైనా సహాయం కోరితే ముందుండే సహజ స్వభావం ఆయనదని స్మరించుకున్నారు. ఆయన మృతి కేవలం ఒక కళాకారుడి కోల్పోవడం మాత్రమే కాకుండా, ప్రజా ఉద్యమాలకు అంకితమైన గొంతుకను కోల్పోవడమని పేర్కొన్నారు. జహంగీర్ మృతి పట్ల ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.

## దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో గ్రామసభల నిర్వహణ



**దుబ్బాక, ఏప్రిల్ 02 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం దుబ్బాక మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. వార్డుల్లోని సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దుబ్బాక మున్సిపాలిటీలోని 4,5, 12,14, 16, 20వ వార్డుల్లో నిర్వహించిన గ్రామసభలో ప్రత్యేక అధికారిగా డిఆర్‌ఓ నాగరాజమ్మ పాల్గొని, గ్రామసభలను పర్యవేక్షించారు.ప్రజల నుంచి అర్జీల రూపంలో పలు వినతులను స్వీకరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వము గ్రామసభలను నిర్వహిస్తోందని, ప్రజలందరూ అధిక సంఖ్యలో గ్రామసభల్లో పాల్గొని, వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ కుమార్, వార్డు కౌన్సిలర్లు అధికం బాలకిషన్, కోల నిరోషా, బండి శ్రీలేఖ, తునికి సురేష్, దేవుని రాజు, ఐరెని అఖిల, వార్డు అధికారులు, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి





## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 2 (నినాదం)**

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులే కాక ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గద్వాల మండలం చేనుగోనుపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ కు రూ 500 సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాని అర్హులైన వారికి కూడా ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని తెలియజేశారు. ఇటీవలే రైతు భరోసా పంటల పెట్టుబడి సాయాన్ని ఎకరా లోపు పొలం ఉన్న రైతులకు ఇవ్వడం జరిగిందని, మిగతా రైతులకు కూడా దశలవారీగా రైతు భరోసా డబ్బులు వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉండే బాల్యవివాహాలు, ఇతర సామాజిక సమస్యలపై ప్రతి ఒక్క పౌరులు స్పందించి వాటి నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర గీతంతో గ్రామ సభను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పద్మమ్మ స్వాగత ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. గ్రామంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారుల వివరాలను తెలియజేశారు. అలాగే పలువురు లబ్ధిదారులు సంక్షేమ పథకాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, మండల ప్రత్యేక అధికారి నూకరాజు, డిఎల్ పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, ఇన్చార్జి ఎంపీడీవో చంద్రకళ, హౌసింగ్ డిఇ కాశీనాథ్, ఉప సర్పంచ్ రాముడు, పంచాయతీ కార్యదర్శి రామ నర్సింహులు, వివిధ శాఖల ఇతర అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలు అందరికీ స్ఫూర్తి కావాలి

## నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 2 (నినాదం)**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలు అందరికీ స్ఫూర్తి దాయకమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఆయన చూపిన ధైర్య సాహసాలు సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలు నేటి తరానికి కూడా ఎంతో దోహతా పడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర మాజీ ఎమ్మెల్యే వంగ మోహన్ గౌడ్ రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు పకీరయ్య గౌడ్ మల్లయ్య గౌడ్ వెంకటయ్య గౌడ్ వంగ రమేష్ గౌడ్ నాగరాజు గౌడ్ నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక లాభదాయకమైన సాగుతో రైతులు మరింత ఆర్థికంగా రాణించాలి

## రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ వై. జె పద్మహర్ష

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 2 (నినాదం)**



నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.జె. పద్మహర్ష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అందించిన సందేశాన్ని చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా వై.జె. పద్మహర్ష మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలలో రైతులకు అందించిన సంక్షేమ పథకాలు, వ్యవసాయ ఆధునికీకరణలో చేసిన అభివృద్ధిని ప్రజలకు ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, నూతనంగా అందించే పథకాలను వివరించడమే కాకుండా, రైతుల అవసరాలు, ముఖ్యంగా పంట మార్పిడి మరియు మార్కెటింగ్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకునేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఉపాధి హామీ పథకం వంటి పలు కార్యక్రమాల అమలు గురించి వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 1,11,297 మంది రైతులకు రూ. 947.45 కోట్ల రుణమాఫీ చేయబడినట్లు తెలిపారు. అదేవిధంగా 3,06,983 మంది రైతులకు రూ. 415.23 కోట్ల రైతు భరోసా అందించినట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ఒకే రకమైన పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరాకు సుమారు రూ. 51,000 వరకు సహాయం అందిస్తున్నదని, ఇందులో మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, నిర్వహణ ఖర్చులు, ఫామ్ పాండ్‌లు వంటి అంశాలు ఉన్నాయని తెలిపారు మూడు సంవత్సరాల పాటు ఆయిల్ పామ్ సాగు చేసిన తర్వాత నాలుగో సంవత్సరం నుంచి ఆదాయం లభిస్తుందని, ఆ సమయంలో కూడా అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, నాగర్‌కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, మండల స్థాయి అధికారులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, గ్రామ ప్రజలు మరియు రైతులు పాల్గొన్నారు

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి





**ఆర్మూర్, ఏప్రిల్ 2 (నినాదం):**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బాల్కొండ నియోజకవర్గం వ మండల కేంద్రంలోని వేల్పూర్ గ్రామంలో గల ప్రసిద్ధ జంబీ హనుమాన్ (అభయాంజనేయ స్వామి) ఆలయం భక్తులతో గురువారం రోజున కిటకిటలాడింది. హనుమాన్ జయంతి పర్వదినం పురస్కరించుకొని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని, ఆయన ఆశీస్సులు అందుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ ఆ స్వామి వారి కృప లభించాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# ఆరో వార్డును అభివృద్ధి చేయడం లక్ష్యం

## ఆరో వార్డు కౌన్సిలర్ కేంద్యాల శ్రీనివాస్

### ఆరో వార్డు లో ఘనంగా ప్రజాపాలన – పట్టణ ప్రగతి 99 రోజుల యాక్షన్ ప్లాన్

**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో, ఏప్రిల్ 2 (నినాదం)**

తనపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించిన ఆరవ వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెడతానని ఈ వార్డు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఆరవ వార్డు కౌన్సిలర్ కేంద్యాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – పట్టణ ప్రగతి 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా భూత్పూర్ మున్సిపాలిటీ లోని 6. వ వార్డు ప్రజలతో కలిసి వార్డు కౌన్సిలర్ కేంద్యాల శ్రీనివాస్ పాల్గొని ఆరో వార్డ్ అభివృద్ధికి కావలసిన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు, మున్సిపల్ నిధుల నుండి ఈ ఈ వార్డ్ అభివృద్ధికి కావలసిన నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ వాడుకు రావాల్సిన వాటాను కచ్చితంగా కేటాయించి వాడ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. వార్డులో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కావాల్సిన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బాలకోటి వార్డు అభివృద్ధికి కావలసిన సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. ఆరో వార్డు ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత మరియు మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆటో వార్డు కౌన్సిలర్ కేంద్యాల శ్రీనివాస్ వార్డులో ఉన్న రోడ్లు డ్రైనేజీ సమస్యలు విద్యుత్ సమస్యలు, అండర్ డ్రైనేజ్ పనులు మరియు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్ల పనులపై సంబంధిత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డ్ కౌన్సిలర్ పద్మ, ఆరో వార్డు ప్రజలు, యువకులు , ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు సభలు కీలకం

## 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి

**కొత్తగూడెం, ఏప్రిల్ 2(నినాదం)**



ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి సమర్థవంతమైన పరిష్కారాలు చూపడంలో వార్డు సభలు కీలక పాత్ర పోషిస్తున్నాయని 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" (99 రోజుల యాక్షన్ ప్లాన్) కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని నాయకులగూడెం గ్రామంలో వార్డు సభ నిర్వహించారు. కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి అధ్యక్షతన జరిగిన ఈ సభను తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గత రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు చేపట్టిన పనుల పురోగతిని ప్రజలకు వివరించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి అందించిన సందేశాన్ని కూడా సభలో తెలియజేశారు. సభలో పాల్గొన్న ప్రజల అభిప్రాయాలను స్వీకరించి, డివిజన్ పరిధిలో ఉన్న వివిధ సమస్యలను చర్చించారు. వాటి పరిష్కారానికి ప్రాధాన్యత క్రమంలో పలు అంశాలపై తీర్మానాలు చేసి, మినిట్స్ బుక్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు, వ్యవసాయ అధికారి నర్మద, 21వ డివిజన్ స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, మునిసిపల్ అధికారి కిరణ్, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం





## డాక్టర్ కోటా రాంబాబు

**మధిర, ఏప్రిల్ 2 (నినాదం):**

బోనకల్ మండలం: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోట రాంబాబు అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డుకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు ఎంపీ కోటా నుండి సిసి రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మధిర నియోజకవర్గం అభివృద్ధి పథంలో ఉరుకులు పెట్టిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. అంతర్గత రహదారులతో పాటు గ్రామాలకు ఉన్న లింకు రహదారులను కూడా బీటీ రోడ్లుగా మార్చుతున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టెలికం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ ఉమ్మినేని కృష్ణ, గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బంధం నాగేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ అమరే సీతయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బోయినపల్లి వెంకటేశ్వర్లు, బోయినపల్లి మురళి, బండి వెంకటేశ్వర్లు, సైదా నాయక్, కన్నీటి సురేష్, కన్నీటి సురేష్, హుస్సేన్, వార్డు సభ్యులు షేక్ షాన్ పాషా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ జిల్లా అధ్యక్షునిగా.. వంగూరి జయశంకర్!

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 2 (నినాదం)**



మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ. నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా. వంగూరి జయశంకర్ ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్. డా. పిడమర్తి రవి నియామక పత్రాన్ని అందించినట్లు. వంగూరు జయశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న హైదరాబాదులో.జరిగే అంబేద్కర్ జయంతి సభను. బ్లూ. బ్లాక్. గ్రీన్ షర్ట్స్. క వత్తు సభ వేల మందితో నిర్వహిస్తున్నట్లు. తెలిపారు. ఈ సభ డిమాండ్స్ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి. ఎస్సీ లకు 20 శాతం. బీసీలకు 42 శాతం. ముస్లింలకు 12 శాతం. రిజర్వేషన్లు కల్పించాలి. మార్వాడి వ్యాపార దోపిడీలపై నియంత్రణ చేయాలి. ఈ డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నట్లు వంగూరి జయశంకర్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షునిగా నియమించిన డాక్టర్ పిడమర్తి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవ కొత్త రుసుములు అమల్లోకి

## వినియోగదారులు సహకరించాలని జిల్లా మీసేవ అధ్యక్ష,కార్యదర్శుల విజ్ఞప్తి

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 2 (నినాదం):**



రాష్ట్ర ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం, ఏప్రిల్ 1 నుంచి మీసేవ సేవలపై కొత్త చార్జీలు అమలులోకి వచ్చాయి. దీంతో గతంలో కంటే ప్రస్తుతం సేవల రుసుముల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అందువల్ల, వినియోగదారులు పాత చార్జీలతో పోల్చి సందేహాలు వ్యక్తం చేయకుండా,ప్రభుత్వం నిర్ణయించిన తాజా రుసుములను చెల్లించి సహకరించాలని జిల్లా మీసేవ అధ్యక్షులు సితారే క్లేవిన్ (రాజ్ ) విజ్ఞప్తి చేస్తున్నారు.తాజా చార్జీలను గమనించి సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఇదే సమయంలో, ఇన్నేళ్లుగా పెంపు లేకుండా ఉన్న మీసేవ సేవల చార్జీలను పెంచినందుకు,రాష్ట్ర ప్రభుత్వానికి మీసేవ కేంద్రాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కొత్తగూడెం గనుల్లో భద్రతా చర్యలపై సమీక్ష

**కొత్తగూడెం, ఏప్రిల్ 2(నినాదం)**





దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ నిఖిల్ రావు, ఐఆర్‌టీఎస్ సింగరేణి సంస్థకు చెందిన కొత్తగూడెం ఏరియాలోని గనులను గురువారం సందర్శించి భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీవీకే నం.5 ఇంక్లైన్ అండర్‌గ్రౌండ్ గని మరియు వీకేసీఎం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులను సందర్శించారు. గనుల్లో అమలవుతున్న భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి విధానాలు, సాంకేతిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న చర్యలను ప్రశంసించిన నిఖిల్ రావు, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. గనుల అభివృద్ధికి ఇలాంటి సమీక్షలు దోహదపడతాయని, సంబంధిత విభాగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్శన సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు అతిథిని సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎసఓటు జి ఎం కోటి రెడ్డి, పీవీకే నం.5 ఇంక్లైన్ మైన్ ఏజెంట్ రాంభరోస్ మహతో, మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మోర్తాడ్ న్యాయవాది ప్రవీణ్ చందర్

**ఆర్మూర్, ఏప్రిల్ 2 ( నినాదం)**

ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మోర్తాడ్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది ప్రవీణ్ చందర్ నియామకం కావడంతో సర్వత్ర హర్షతీరేఖలు వ్యక్తం అవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో గల ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు మంగళవారం రోజున నిర్వహించారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ముగ్గురు న్యాయవాదులు పోటీలో నిలిచారు. కాగ ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీలో నిలువగ, సమీప ప్రత్యార్థులపై ప్రవీణ్ చందర్ న్యాయవాది 30 ఓట్ల ఆదిత్యంతో విజయం సాధించారని ఎన్నికల అధికారులు జీవన్, అశోక్, సిద్దబా తుల్లా ఖాన్ లు వెల్లడించారు. మొత్తం బార్ అసోసియేషన్ లో 109 ఓట్లు పోలుకాగా, ప్రవీణ్ చందర్ న్యాయవాది ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 30 ఓట్ల తో విజయం సాధించారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్ చందర్ తో పాటు, ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి రాజేందర్, సహాయ కార్యదర్శి నాగరాజులను ఆర్మూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, అభినందనలు తెలియజేశారు.

# సన్నబియ్యంను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి



**గద్వాల బ్యూరో ఏప్రిల్ 2 (నినాదం)**

ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు అందజేస్తున్న సన్నబియాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గంజిపేట రహదారిలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ పథకంలో భాగంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను ఇదే నెలలో ఒకేసారి అందచేయడం జరుగుతుందన్నారు. దుకాణం పరిధిలోని తెల్లరేషన్ కార్డులు, అంత్యోదయ కార్డుల వివరాలను కలెక్టర్ సంబంధిత రేషన్ డీలర్ ను అడిగారు. అలాగే పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా రేషన్ బియ్యం పంపిణీ పరిశీలించారు.

# వడ్డేపల్లి మున్సిపాలిటీలో వార్డు సభలు విజయవంతం

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 2 (నినాదం)**





జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ల ఆధ్వర్యములో అవార్డు సభలు విజయవంతమయ్యాయి. మున్సిపాలిటీలోని మొత్తం 10 వార్డులలో వార్డు సభలు నిర్వహించడం జరిగింది. 2వ వార్డులో వైస్ చైర్-పర్సన్ ఆధ్వర్యంలో జరిగిన వార్డు సభలు మున్సిపల్ కమిషనర్ శ్రీ. సొంటే రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు హాజరైన వార్డు ప్రజలను ఉద్దేశించి వైస్ చైర్ పర్సన్ శ్రీ. సారంధ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయినటువంటి 1. రైతు భరోసా, 2. చేయూత, 3. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, 4. ప్రీ ప్రైమరీ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు టిఫిన్ మరియు ఇంటర్మీడియట్ కు మధ్యాహ్న భోజనం తదితర పథకాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రాజయ్య మాట్లాడుతూ కొత్త కౌన్సిల్ సభ్యుల సహకారంతో మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని లబ్ధిపొందాలని సూచించారు. ఇంకా గౌరవ కౌన్సిల్ సభ్యులు కుర్వ పావని (2 వ వార్డు కౌన్సిలర్) , వెంకట రామాన్ (3వ వార్డు కౌన్సిలర్), పోలకల్ సూరి, (9వ వార్డు కౌన్సిలర్) ఆధ్వర్యంలో వార్డు సభలను నిర్వహించడం జరిగినది. ఇట్టి వార్డు సభలకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు స్థల మార్పిడికి కట్టుబడి ఉన్నాం

## డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ తీర్మానం

ఎమ్మెల్యే పదవికి
అనర్హుడు కౌశిక్ రెడ్డి
ఎమ్మెల్యేకు ప్రచారం ఎక్కువ..
అభివృద్ధి తక్కువ
పొలిటికల్ డైవర్షన్ కోసం
కౌశిక్ రెడ్డి కొత్త నాటకం
మీడియా సమావేశంలో
నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్



**జమ్మికుంట, ఏప్రిల్ 2 (నినాదం)**

అసెంబ్లీ సాక్షిగా సీనియర్ శాసన సభ్యుడు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి వివక్ష చూపించడం దారుణమని,సీనియర్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుని పట్ల కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందనీ,వెంటనే కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ డిమాండ్ చేశారు.గురువారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా కౌశిక్ రెడ్డి అరాచకాలు ఎక్కువ అయ్యాయని తన ప్రవర్తన రాష్ట్రం మొత్తం చూసిందని,ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని,కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని కోరారు.గతంలో గవర్నర్ ను,కులాలను,మత విద్వేషాలు రెచ్చగొట్టేలాగా మాట్లాడడం,జర్నలిస్టులను,వ్యాపారస్తులను బెదిరించడం, కొట్టడం,రైతులను తిట్టడంలాంటి వల్ల నియోజకవర్గం లోని ప్రజలు ఇంకెంత కాలం భరించాలి అని తలలు పట్టుకుంటున్నారని,ప్రజలను ఇబ్బంది పెట్టే ఇలాంటి ఎమ్మెల్యే మాకు అవసరమా అని అనుకుంటున్నారని అన్నారు.ప్రభుత్వంలో ఉన్న మంత్రికి సంబంధించిన కంపెనీలపై సీబీ,సీఐడి విచారణ వేశామంటేనే మా పార్టీ ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని,కౌన్సిలర్లు, మండల, పట్టణ అధ్యక్షులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**దళిత వ్యతిరేకి కౌశిక్ రెడ్డి..**

దళిత బంధు విషయంలో అప్పుడు ఎమ్మెల్సీగా,విప్ గా ఉన్న కౌశిక్ రెడ్డి పూర్తి స్థాయిలో ఎందుకు దళిత బంధు ఇవ్వలేదని,చంపినోడే సంతాప సభ పెట్టినట్టు దళిత బంధు విషయంలో అబద్దాలు మాట్లాడుతున్నాడని అసలు దళిత బంధు ఆపిందే కౌశిక్ రెడ్డి అని,ఆనాడే అందరికి ఇవ్వగా ఎవరు ఆపారని ప్రశ్నించారు.కేవలం ఓట్ల కోసం వారిని వాడుకున్నారని నిజంగా వారి అభ్యున్నతికి పాటు పడాలనే ఉద్దేశ్యం ఉంటే కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడే ఇచ్చే వాడని అన్నారు.మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత బంధు లబ్దిదారులకు పూర్తి స్థాయిలో ఇస్తున్నామని ఓట్ల కోసం కాకుండా వారి అభ్యున్నతికి పాటు పడుతున్నామని అన్నారు.

**డంపింగ్ యార్డు వేరే చోట మార్చడానికి కట్టుబడి ఉన్నాం**

డంప్ యార్డ్ పై ఇప్పటికే అధికారులకు పూర్తి సమాచారం అందించామని,డంపింగ్ యార్డ్ సమస్యపై త్వరలో అఖిలపక్ష నేతలతో సీఎం రేవంత్ రెడ్డినీ కలుస్తామని ప్రజలకు హాని చేసే ఏ కార్యక్రమం ప్రభుత్వం తీసుకోదని మరోసారి స్పష్టం చేశారు ప్రణవ్.హుజూరాబాద్ నియోజకవర్గ భవిష్యత్ మాకు ముఖ్యమని ఇప్పటికే మంత్రులకు ఈ విషయంపై పలుమార్లు పూర్తి నివేదిక అందజేశామని,దీనిపై రద్దుకు మా వంతు కృషి చేస్తామని అన్నారు.అయితే డంపింగ్ యార్డ్ విషయంలో కావాలని కౌశిక్ రెడ్డి తనపై ఉన్న సీబీ,సిఐడి కేసు నుండి డైవర్షన్ కోసం కొత్త డ్రామా మొదలు పెట్టాడని ఎద్దేవా చేశారు.విచారణ 4తేదీ ఉందని దానికి ముందు బంద్ పిలుపు ఇవ్వడం,విచారణ తర్వాత దీక్షలో కూర్చుంటానని అనడం పట్ల రాజకీయ లబ్ది స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు.వరంగల్ మీటింగ్ లో చొప్పదండి మీటింగ్ లో సీఎం అనని మాటలను అన్నట్టుగా సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని అన్నారు.ఎంత సేపు తన స్వంత రాజకీయ లాభం కోసం ఆలోచించడం తప్ప ప్రజల కోసం కౌశిక్ రెడ్డి చేసింది ఏం లేదని అన్నారు.2022లోనే డంప్ యార్డ్ ప్రతిపాదన వచ్చినప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్ రెడ్డి అప్పుడు సైలెంట్ గా ఉండి ఇప్పుడు మాట్లాడడం,ధర్నా చేస్తా అనడం రాజకీయ కోణం లేదా అని ప్రశ్నించారు.ఎవరెన్ని చెప్పినా డంప్ యార్డ్ వేరే స్థలానికి మార్చడం కాంగ్రెస్ తోనే సాధ్యమని తెలిపారు.

**చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం..**

రైతుల అవసరాల దృష్ట్యా సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనీయమని వారి కోరిక మేరకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని,దీనిపై ఇప్పటికే రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు.రైతులెవరూ అధైర్యపడవద్దని సూచించారు.



## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

### ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (నినాదం):**

అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా GANGADHARA NELLORE బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి 02.07.2026 నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

Muthoot Finance Ltd
Ground Floor, D/NO:1/193,
Main Road, Gangadhara Nellore,
Chittoor District, Andhra Pradesh State,
Pin - 517125.
Phone No - 09188903955, 08138909928.
Email id : mggan2373@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise

## రాజధానిపై జగన్‌ది విధానం లేని వైఖరి

### ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**అమరావతి, ఏప్రిల్ 2 (నినాదం):**

రాష్ట్ర రాజధాని అంశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్పష్టమైన విధానం గానీ, నినాదం గానీ లేవని, ఆయన గందరగోళ నిర్ణయాలతో ప్రజలను మోసం చేశారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమాన్ జయంతి, ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం వంటి శుభ తరుణంలో అమరావతికి కేంద్రం నుంచి సానుకూల ముందడుగు పడటం రాష్ట్రానికి శుభపరిణామమని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా అమరావతిని అంగీకరించిన జగన్, ఆ తర్వాత మూడు రాజధానుల పేరుతో మాట మార్చారని, ఇది ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని యార్లగడ్డ ఆరోపించారు. "ఒకరోజు ఒక మాట, మరుసటి రోజు మరో మాట మాట్లాడటం జగన్ రాజకీయాల అసలు స్వరూపం. ఆయన ప్రజలను మోసం చేశారు" అని విమర్శించారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు ఒకే రాజధాని ఉంటే, ఏపీలో మాత్రం జగన్ తన రాజకీయ లబ్ది కోసం మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు.

## ప్రైవేటీకరణ కుట్రల నుంచి బటయపడని స్టీల్ ప్లాంట్

### నగరంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నిరసన




**విశాఖపట్టణం, ఏప్రిల్ 2 (నినాదం):**

ప్రభుత్వ రంగంలోని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమ చూపిస్తున్నాయని, ప్రైవేట్ రంగం పట్ల ప్రేమ చూపిస్తూ, ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మిక,ప్రజా సంఘాల జెఏసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ, ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెఏసి ఆధ్వర్యంలో విశాఖ నగరంలో కార్మిక ప్రజా సంఘాలు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. డిఆరఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవన్నారు. జి ఎస్ టి రాయితీలు లేవన్నారు. వాటర్ రాయితీ లేదన్నారు. స్టీల్ ప్లాంట్ లో తొమ్మిది వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, స్టీల్ ప్లాంట్ పై సుమారు రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అనేక దశాబ్దాల పాటు లాభాలలో నడిచిన స్టీల్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నిర్ణయించిందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ, కార్మికులు ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారని చెప్పారు. ఇదే సందర్భంలో అనకాపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆర్ సి ఎల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రా మెటీరియల్ గ్యారెంటీ ఇచ్చాయన్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ చెల్లించిన అవసరం లేదన్నారు. 10 సంవత్సరాల వరకు వాటర్ పై పన్ను లేదన్నారు. 15 సంవత్సరాల పాటు పూర్తి రాయితీ ఎలక్ట్రిసిటీ కల్పిస్తున్నారు. 2.9 కిలోమీటర్ల వరకు క్యాపిటల్ పోర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. ప్రైవేటు మిట్టల్ పై ఉన్న ప్రేమ, ప్రభుత్వ రంగం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మార్చుకొని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ టియు జాతీయ అధ్యక్షుడు ఎన్. కనకరావు, సిపిఎం మాజీ ఫ్లోర్ లీడర్ బి.గంగా రావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్, అధ్యక్షులు కె.ఎం శ్రీనివాస్,ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుత్ రావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ,స్టీల్ ప్లాంట్ సిఐటియు యూనియన్ నాయకులు అయోధ్య రామ్,ఎన్.రామస్వామి,ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం, ఐఎఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు,వైఎసఆర్ టియుసి యూనియన్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి

### ఇబ్రహీంపట్నంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం





**మెట్‌పల్లి ఏప్రిల్ 2 (నినాదం):**

రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఏఎంసీ సెంటర్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధరను అందిస్తూ కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తోందన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి లాభదాయక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడం సంతోషకరమని తెలిపారు. తూకం, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించి రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు తేమ శాతం ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రంగా పంటను తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహారావు, మార్క్‌ఫెడ్ అధికారులు, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## వేసవిలో పశుసంరక్షణ మార్గదర్శకాలు పాటించాలి

### పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు..

**విజయవాడ, ఏప్రిల్ 2 (నినాదం):**

వేసవికాలంలో సంభవించే ఈదురుగాలులు గ్రీష్మతాపం వడగాలులు వలన పశువుల ఆరోగ్యం క్షీణిస్తుందని ఇది వాటి మరణాలకు దారితీయవచ్చునని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు సూచించారు. అప్పుడు పశువులను కాపాడడానికి పశుసంవరక క్షేత్రస్థాయి సిబ్బంది సూచనలు పశుపోషకులు తూచా తప్పకుండా పాటిస్తే పశువుల్లో వృద్ధి రేట్ పెరిగి పశుసమద్ధి జరుగుతుందని వాటి ఉత్పత్తి సామర్థ్యం సైతం రెట్టింపు అవుతుందని అన్నారు. పశువుల యాజమాన్యం అనేది ఎలా ఉండాలి అనే అంశంపై గురువారం పశుసంవర్ధక క్షేత్ర స్థాయి సిబ్బందికి మరియు పశుపోషకులకు అయన సూచనలు జారీ చేశారు. పశుపోషకులు క్షేత్ర స్థాయి సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఈ విషయంలో పశుసంవర్ధక క్షేత్ర స్థాయి సిబ్బంది ఎల్లవేళలా జారీ చేసే సూచనలు పాటించి మేలైన పశువుల యాజమాన్యం సాధించాలని ఆయన తెలిపారు.

## స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 2 (నినాదం) :**

హిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్సీడీఏ) కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్ యూ)కి సంబంధించిన భవన సముదాయాల నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన నిర్మాణ పనులతో పాటు ఆ ప్రాంత రూపకల్పనలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే, స్కిల్స్ యూనివర్సిటీకి చెందిన పలు భవనాలను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఇతర అధికారులు ఉన్నారు.



## గ్రామాల ప్రధాన కూడలిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

### ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 2 (నినాదం)**

గ్రామ అభివృద్ధి, ప్రజా భద్రత, నేర నియంత్రణ, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవన్ అన్నారు . గురువారంనల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికా గ్రామసభను పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో నేరాలను అరికట్టాలంటే గ్రామ ప్రవేశ ద్వారాలు, ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడే ముఖ్యమైన భద్రతా చర్య అని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, అధిక వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. యువత మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తమ భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్పి సీఐ రాము,నార్కట్పల్లి సీఐ నాగరాజు, ఎస్సై విష్ణు, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిన్నటి కలలు... ఈరోజు కన్నీటి వెలలు

## "ధర్మపురి శోకసంద్రం... ఒక్క నిర్లక్ష్యం, ఎన్నో కన్నీళ్లు"

**ధర్మపురి ఏప్రిల్ 2 (నినాదం)**

ధర్మపురిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం పట్టణాన్ని శోకసంద్రంలో ముంచింది. ఒక్క క్షణం నిర్లక్ష్యం మూడు ప్రాణాలను బలి తీసుకోగా, ఎనిమిది మంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మరోసారి రోడ్డు భద్రతపై ఉన్న నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసింది. పోలీసుల వివరాల ప్రకారం, ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న MH 26 CH 5552 నంబర్ గల సిమెంట్ లోడ్ లారీ, ఎదురుగా వస్తున్న AP 15 BS 8585 రాయల్ ఎన్ఫీల్డ్ బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన దెబ్బకు బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం లారీ డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనాన్ని ఎడమవైపు తిప్పడంతో, పక్కనే వెళ్తున్న ఆటోను ఢీకొట్టగా, అందులో ఉన్న 8 మంది భక్తులు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన సయ్యద్ ఖాసిం బాసుమియా (42)గా పోలీసులు గుర్తించారు. ప్రాథమికంగా అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణమని పోలీసులు భావిస్తున్నారు. మృతులు మాదాసు అమర్నాథ్ (18), పడాల రిశ్వంత్ (16), కోల మయాంక్ (15) గా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు మైనర్లు ఉండటం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో స్పష్టం చేస్తోంది.





**మంత్రి పరామర్శ...**

ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో శోక తప్త హృదయంతో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. మంత్రి వెంట జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

**ఇంకా ఎన్ని ప్రాణాలు పోతే చర్యలు?**

ధర్మపురిలో మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనదారులు విర్రవీగడం సాధారణంగా మారింది. పెద్ద సమస్య ఏంటంటే తల్లిదండ్రులు ట్రాక్టర్ వంటి వాహనాలు సైతం మైనర్ లకు ఇవ్వడం వల్ల ఎప్పుడు ప్రమాదాలు జరుగుతాయో అని రోడ్లపై జనాలు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా మైనర్ టాటా మ్యాజిక్ ను అతివేగంగా నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక అధ్యాపకుడు ప్రాణాలు కోల్పోయినా, పరిస్థితిలో మార్పు రాకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనతో మరోసారి స్పష్టమైంది

**మైనర్ డ్రైవింగ్ – సమాజం చేసిన పెద్ద తప్పు**

ఈ ప్రమాదంలో ఇద్దరు మైనర్లు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది. ధర్మపురిలో మైనర్ డ్రైవింగ్ ఇప్పుడు ఓ ప్రమాదకర అలవాటుగా మారింది. తల్లిదండ్రుల నిర్లక్ష్యం, విద్యాసంస్థల్లో చట్టాల అమలు తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేయకపోవడమే వైఫల్యం, పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించినప్పటికీ రాజకీయ జోక్యం, ఒత్తిళ్లు , బెదిరింపులు, వివిధ రాజకీయ పార్టీల నేతల వేధింపులు , సోషల్ మీడియాలో పోలీసుల పై విష ప్రచారం చేసే విధంగా పోస్ట్ లు పెట్టడం వంటి ఘటనలతో పోలీసుల చేతులు కట్టేస్తున్నారు. ఇవన్నీ కలిసి ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



**నిబంధనలు ఉన్నా... అమలు లేదు!**

ఇప్పటికైనా వాహన చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు, నిపుణులు ఒకే మాట చెబుతున్నారు .ఇక సడలింపులు ఇవ్వకుండా పని కిరావు. మైనర్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలి. వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడంపై కఠిన చర్యలు తీసుకోవాలి వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాలి. విద్యాసంస్థల్లో బైక్‌లపై పూర్తి నిషేధం విధించాలి. నిరంతర ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని జరిమానాలు కాకుండా ... కఠిన చర్యలే పరిష్కారం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**చివరి హెచ్చరిక**

"నిబంధనలు పాటిస్తే జీవితం... ఉల్లంఘిస్తే ప్రమాదం!" ధర్మపురి ఘటన ఒక హెచ్చరిక మాత్రమే కాదు... ఒక గట్టినిజం. ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోకపోతే, ఇటువంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రాణాలను కాపాడాలంటే... నిబంధనలను కఠినంగా అమలు చేయడం తప్ప మార్గం లేదు! ఇప్పటికైనా మేల్కొనకపోతే... రోడ్లు శ్మశానాలుగా మారడం ఖాయం!

# జగన్.. చపలచిత్త రాజకీయాలు !

సంపాదకీయం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్`బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్`బీ కింద మచిలీపట్నం (మా) `విజయవాడ (వి)`గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివ□ద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం`విజయవాడ`గుంటూరు మధ్య 110 కిలోవి□టర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్టా□లకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని ఆన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్టా□ల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్టా□న్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవిక□త రాజకీయ మేధను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్టా□నికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# అసమాన యోధుడు జనరల్ మానెక్‌షా

### ఏప్రిల్ 3...భారతీయ సైన్య మొదటి ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా జయంతి



ఆయన యుద్ధ వీరుడు. సాహస సైనికుడు. సమర్థ నాయకుడు. అయిదు యుద్ధాలలో పాల్గొని, తుపాకీ గుళ్ళు శరీరంలో దిగినా, విశ్రమించని పోరాట యోధుడు. పాకిస్తాన్ యుద్ధ విజయ సారథి. ఆయనే ధైర్య సాహసాలకు మారు పేరుగా నిలిచిన భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా. అయన పూర్తి పేరు శాం హోర్ముస్‌జీ ఫ్రేంజీ జెమ్‌షెడ్జీ మానెక్ షా (ఏప్రిల్ 3, 1914 – జూన్ 27, 2008). 1971లో పాకిస్తాన్తో యుద్ధంలో భారత్‌కు అతిపెద్ద సైనిక విజయాన్ని సాధించి పెట్టిన ఆయన బంగ్లాదేశ్ ఆవిర్భావానికి అద్యుదయ్యారు.

1914 ఏప్రిల్ 3వ తేదీన అమృతసర్ లోని పార్శీ దంపతులకు మానెక్‌షా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ అనే చిన్న పట్టణం నుంచి అమృతసర్, పంజాబ్ రాష్ట్రంకు వలస వెళ్ళారు.
అమృతసర్, నైనిటాల్‌లలో పాఠశాల విద్య పూర్తయ్యాక డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో క్యాడెట్‌గా తొలి బ్యాచ్‌లో మానెక్ షా చేరారు.1934లో ఆయన సైన్యంలో రెండో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. జూన్ 7, 1969 న జనరల్ కుమార మంగళం నుండి 8వ సైనిక దళాల ప్రదానాదికారిగా బాధ్యతలు స్వీకరించి 15, జనవరి 1973 న పదవీ విరమణ చేసారు.

బ్రిటిష్ పాలనా కాలం మొదలుకొని నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో సేవలు అందజేసిన శాం మానెక్‌షా– రెండవ ప్రపంచ యుద్ధంలోను, భారత స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్థాన్‌లతో జరిగిన మూడు యుద్ధాల సందర్భంగాను ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధి కుశలత అమోఘమైనవి. రెండో ప్రపంచ యుద్ధం జరుగు తున్నప్పుడు జపాన్ ఆక్రమిత దళాలను తిప్పి కొట్టేందుకు ఉద్దేశించిన సైనిక విభాగం అధిపతిగా బర్మాలో ఆయన ప్రాణాలొడ్డి పోరాడారు. కడుపులోకి ఏడు గుళ్లు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఇచ్చే అత్యున్నత పతకం 'మిలిటరీ క్రాస్'ను మృతులకు ప్రకటించ రాదన్నది నియమం. మానెక్‌షా బతికి బట్టకట్టక పోవచ్చునని భావించిన నాటి మేజర్ జనరల్ డి.టి.కోవన్, తన 'మిలిటరీ క్రాస్ రిబ్బన్'ను తక్షణం మానెక్‌షాకు ప్రదానం చేశారు. అదృష్టవశాత్తు మృత్యుముఖం లోంచి బయట పడిన మానెక్‌షా, మరోసారి బర్మాలో జపాన్ సైనికులను ఢీకొన్నారు. మళ్ళీ గాయ పడినప్పటికీ వెన్ను చూపలేదు. జపాన్ సైనికులు లొంగిపోయాక, 10 వేల మందికిపైగా యుద్ధ ఖైదీలకు పునరావాసం కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1947లో దేశవిభజన, 1947–48లో జమ్ము కాశ్మీర్‌లో సైనిక చర్యల సందర్భంగా ఆయన తన పోరాటపటిమను మరోమారు లోకానికి చాటి చెప్పారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం ఆయన వ్యూహ నైపుణ్యానికి, దీక్షాదక్షతలకు అద్దం పట్టింది. ఆ యుద్ధంలో పాక్ చిత్తుగా ఓడిపోవడమే కాదు, 45,000 మంది పాక్ సైనికులు, మరో 45,000 మంది పౌరులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తరువాత బంగ్లా ఆవిర్భావానికి దోహద పడిన సిమ్లా అంగీకారం కుదర్చడంలోనూ ఆయనది కీలక భూమికే. ఆయన సమర్థ సారథ్యం దేశసైనిక దళాల్లో సరికొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1973 జనవరిలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించి, ఆయనను సముచిత రీతిలో గౌరవించింది.

1971 ఆరంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి పెద్దయెత్తున శరణార్థులు భారత్‌లోకి వస్తున్న సమస్యపై ఆ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన క్యాబినెట్ సమావేశానికి త్రివిధ దళాధిపతుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మానెక్‌షానూ ఆహ్వానించారు.ఈ సమస్యని పరిష్కరించడానికి తక్షణం సైనికులని పంపాలన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణముతో ఒప్పుకోకుండా, వెంటనే యుద్ధానికి దిగక తప్పదంటే మానసిక లేదా శారీరక అనారోగ్య కారణాలపై రాజీనామా చేయడానికీ తాను సిద్ధమే అనడం ద్వారా తన నాయకత్వ లక్షణాలని చాటిన ఈయన, తన సమర్థ వాదనతో క్యాబినెట్‌ను ఒప్పించి 1971 డిసెంబరులో, అన్ని విధాలా సానుకూల పరిస్థితుల్ని చూసుకొని పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించి, అద్భుత విజయం సాధించి చూపి తన నిర్ణయం ఎంత సరియినదో నిరూపించి వ్యూహ కర్తగా ఆయన చతురతను చాటిచెప్పిన వైనం అద్వితీయం.

మీ యుద్ధ విమానాలు నాశనం చేశాం, మిమ్మల్నందరిని మా సైనికులు చుట్టూ ముట్టి వున్నారు. లోంగిపోక పోతే నిర్ధాక్ష్యంగా చంపేస్తాం అంటూ పాకిస్తాను సైనికులని కఠినంగా హెచ్చరించి శత్రువులని లొంగదీసుకున్న గొప్ప తనం ఆయనకే సొంతం.

శాం మానెక్‌షా గొప్ప వక్త కూడా. ముక్కుసూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. భారత సమాజాన్ని నాయకత్వ కొరతే పట్టి పీడిస్తోందంటూ ఒక సందర్భంలో ధైర్యంగా దాపరికం లేకుండా చెప్పారు. అన్ని రంగాల్లో నాయకత్వ కొరతే దేశంలోని అస్తవ్యస్త పరిస్థితులకు కారణమని స్పష్టం చేశారు. వృత్తిపరమైన సామర్థ్యం, విజ్ఞానం, నిజాయతీ, నిష్పాక్షికత, ధైర్యం, విశ్వసనీయత, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత – ఇవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలని వివరించి, లక్షలమంది సైనికులకు, సైనికులుగా చేరాలనుకున్న వారికే కాకుండా సామాన్యులకి కూడా స్ఫూర్తిగా నిలిచారు.

భారత్‌కు ఎన్నో విజయాలను అందించిన యుద్ధ సేనాని మానెక్ షా జూన్ 26, 2008 గురువారం అర్ధరాత్రి 94ఏళ్ల వయసులో మృతి చెందారు.

**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**

### చికెన్ బంద్‌తో
# దిగివచ్చిన పౌల్ట్రీలు
### డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి

చికెన్ సెంటర్ల బంద్ విజయవంతమైంది. బంద్ దెబ్బకు పౌల్ట్రీ□ కంపెనీలు దిగివచ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ.125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగానే కిలోకు రూ.15, ఆ పైన మార్జిన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వా హకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించు కున్నట్టు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియులు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చేసారు. దీంతో వీరు కూడా ధరలు పెంచి అమ్మారు. నాటు కోడి రేటు ఎక్కువగా ఉంటుంది కనుక సాధారణ రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువగా ఉంటాయి. నాటు కోళ్లను ఇష్టపడేవారు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. బంద్‌తో నాటు కోళ్ల పెంపకందారులు వీటిని మార్కెట్‌కు తరలించారు.

# కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం..కొండగట్టు అంజన్న



తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయ స్వామి దేవాలయం కరీంనగర్ నుండి దాదాపు 35 కిలోమీటర్ల దూరంలో చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలంలోని ప్రకృతి సౌందర్యమైన కొండ పైన శిశాలమైన ప్రదేశంలో కొండగట్టు పై ఆంజనేయ స్వామి దేవాలయం కొలువై ఉన్నది. ఆలయానికి దక్షిణాన కొండల రాయుని కోట గుహలు బొజ్జపూతన కందల రాయుని గుర్రపుడెక్కల గుర్తులు సీతమ్మ కన్నీటి గుంటలు కొండగట్టులో చూడదగ్గ ప్రదేశాలు. 16 స్తంభాలతో కూడిన మండపంలో శ్రీ ఆంజనేయ స్వామి శ్రీ వెంకటేశ్వర స్వామి వారు అల్వాల్ విగ్రహాలు శ్రీ లక్ష్మీ దేవతామూర్తులు ఉన్నాయి. ఆలయ చరిత్ర:సుమారు 160 సంవత్సరాల క్రితం కృష్ణారావు దేశ్ముఖ ఈ దేవాలయాన్ని పునరుద్ధరించి కొంత భూమిని దానం చేసినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. సుమారు 500 సంవత్సరాల క్రితం కొడిమ్యాల పరిగణలోని సింగం సంజీవుడు అనే యాదవుడు ఆవులు మేపుతూ ఈ కొండ కొండ ప్రాంతానికి రాగా ఒక ఆవు తప్పిపోయింది. సంజీవుడు వెతుకుతూ ఒక పెద్ద చింత చెట్టు కింద నిద్రపోయాడు. స్వప్నంలో స్వామివారు కనిపించి నేనిచట కురంధ పొదలో ఉన్నాను నాకు కాస్త ఎండ వాన ముండ్ల నుండి రక్షణ కల్పించు నీ ఆవు ఇదిగో అంటూ చెప్పి అదృశ్యం అయిపోయాడు. సంజీవుడు ఉలిక్కిపడి లేచి ఆవును వెతకుట ఆరంభించగా సూర్యకాంతి వీర జిమ్మి ఆ పవిత్ర పవనసుతుడు కంటపడ్డాడు. సార్ధక నాయుడు సంజీవునికి మనసులో నిర్మల భక్తి భావం పొంగి పొరలింది. సంజీవుడు గొడ్డలితో కోరంతా పదం తొలగించగా శంకు చక్ర గదా అలంకరణతో విశ్వరూపమైన పంచ ముఖాలలో ఒకటైన నరసింహతో ఉత్తరాభిముఖంగా ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి రూపాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. తన సహచరులతో కలిసి స్వామివారికి చిన్న ఆలయం నిర్మించాడు. ఈ క్షేత్రంలో నరసింహస్వామి ముఖము (వక్రము) ఆంజనేయ స్వామి ముఖము రెండు ముఖములతో వేయించేసి ఉండడం ఈ క్షేత్ర ప్రత్యేకత. ఇలా ద్విముకాలతో స్వామి వారు ఎక్కడ వెలిసినట్టు లేదు. నరసింహస్వామి అంటే సాక్షాత్తు విష్ణు స్వరూపం కాబట్టి కొండగట్టు అంజనేయ స్వామి వారికి శంఖము చక్రము వక్షస్థలంలో రాముడు సీత కలిగి ఉండటం ప్రత్యేక విశేషం. ఈ దేవాలయం అనేక కొండలు గుట్టలు దట్టమైన అరణ్యములతో వెలసి ఉన్నది. అనేక నల్ల రాతిబండలు సమూహములు గుహలు అనేక రకముల వృక్షజాతులతో అడవి ప్రాంతంలో నిండి ఉంది. ఈ గట్టుమీదనే శ్రీ ఆంజనేయ స్వామి వారు వెలసినందున దానికి కొండగట్టు అని పేరు వచ్చింది. లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు అంజనేయ స్వామి వారు సంజీవని పర్వతం తీసుకొని వెళ్తుండగా అందులోంచి ఒక ముక్క రాలి ఈ కొండలలో పడగా అదే పవిత్రమైన కొండగట్టు అయిందని మరో కథనం. కొండగట్టులో ప్రధాన ఆలయంతో పాటు బ్రహ్మ పుష్కరిణి సీతమ్మ శ్రీరామ పాదుకలు బేతాళ స్వామి ఆలయం సీత కన్నీటి గుంతలు దర్శనమిస్తాయి. ప్రకృతి సిద్ధంగా వెలిసిన పుష్కరణలో పుణ్యస్నానాలు ఆచరిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. రోగగ్రస్తులు సంతానహీనులు అంజన్న సన్నిధిలో 41 రోజులు గడిపితే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అనాదిగా శ్రీ స్వామివారికి చాత్తాద శ్రీ వైష్ణవ ఆచార సాంప్రదాయ అనుసారంగా శ్రీ స్వామివారికి పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో నిత్య పూజలు ప్రత్యేక పూజలతో పాటు హనుమాన్ జయంతి ఉత్సవాలు శ్రావణమాసంలో జరిగే సప్తహాలు శ్రీరామనవమి ఇతర పండుగలు ఘనంగా భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రభుత్వం దేవాలయాలకు పెద్దపీట వేస్తూ కొండగట్టు అంజనేయ స్వామి దేవాలయానికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతుంది అనడంలో సందేహం లేదు.

**పందిరి: శ్రీనివాసులు. ఎంఏ (జాగ్రఫీ) బీఈడీ, ఎంసీజే (జర్నలిజం) పిజి డిసిజే( జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**

# నిత్య స్మరణీయుడు ఛత్రపతి శివాజీ



### ఏప్రిల్ 3... ఛత్రపతి శివాజీ వర్ధంతి

ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది.

1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు.

శివాజీ జాగీరులో రాంఝా గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది.

దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాపా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి– తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది.
పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నే ళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపు కున్నాడు.

శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోండ్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీగడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## ముదిరాజ్ జర్నలిస్ట్ సమావేశం

**అల్వాల్, ఏప్రిల్ 2 (నినాదం):** ఏప్రిల్ 3 శుక్రవారం మధ్యాహ్నం1 పీఎం కు సికింద్రాబాద్ బోయిగూడ లోని ముదిరాజ్ భవన్ లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా ముదిరాజ్ జర్నలిస్ట్ సమావేశం జరగనున్నట్లు ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మన పెద్దలు, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాసాని వీరేష్ ముదిరాజ్ పాల్గొంటారని మన సంఘం నాయకులు తెలిపారు. కావున మన జిల్లా జర్నలిస్టులందరు తప్పకుండ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

## వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు



**అల్వాల్, ఏప్రిల్ 2 (నినాదం):** బోయిన్పల్లిలోని తాడు బందు శ్రీ వీరాంజనేయ ఆలయంలోహనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తాడుబందు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి , వారి సతీమణి శ్రీమతి మర్రి మమత రాజశేఖర్ రెడ్డి , మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు శ్రీ చామకూర మల్లారెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని శ్రీ వీరాంజనేయ స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ మాజీ బోర్డు సభ్యులు పాండు, గజ్జెల నాగేష్, నాయకులు టి.ఎన్. శ్రీను, జె.ఏ.సి వెంకన్న, సురేష్ తదితర నాయకులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి

### వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే వివేకానంద



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (నినాదం):** గాజుల రామారం డివిజన్ కైసర నగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కోరిన కోరికలను నెరవేరుస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే దైవం అభయాంజనేయ స్వామి అని, స్వామివారి కృపా కటాక్షాలు భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి జహంగీర్ మృతి...



**జవహర్ నగర్, ఏప్రిల్ 2 ( నినాదం):** తెలంగాణ ఉద్యమంలో తుర్కపల్లి జహంగీర్ పాత్ర మరువ లేనిదని ఆయన మృతి సాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటు అని ఐఎఫ్టియు జాతీయ కన్వీనర్ షేక్షావలి, పిఓడబ్ల్యూ( విముక్తి) పెరక సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి జిల్లా మారుమూల గ్రామమైన తుర్కపల్లి జహంగీర్ ప్రజా సమస్యలను పాటల రూపంలో ఎలుగెత్తి చాటుతూ పరిష్కారమే ధ్యేయంగా పనిచేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో జహంగీర్ కాలికి గజ్జ కట్టి భుజాన గొంగడి వేసి ఊరూరా తిరిగి ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలంగాణ వస్తే ఏమొస్తదని తన గొంతుతో వివరించి చెప్పాడని తెలిపారు. జహంగీర్ అలియాస్ తుర్కపల్లి జహంగీర్ గా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నాడని బాల్యం నుంచే పాటలు పాడుతూ ప్రజా మన్ననలు పొందాడని చివరి శ్వాస వరకు జహంగీర్ సాధారణ జీవితం గడపాలని పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కళాకారులు జహంగీర్ మృతి చెందారని ఆయన స్మృతులు చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు. జహంగీర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

### సిఎస్ రామకృష్ణారావు




**రంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 2 (నినాదం) :** 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా... గురువారం జిల్లాలోని మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. గ్రామ సభలో ఏర్పాటు చేసిన సంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ల స్టాల్ లు సిఎస్ కలెక్టర్ సందర్శించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు.రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు.

వివిధ పథకాల లబ్ధిదారులు వారి అభిప్రాయాలను గ్రామ సభలో తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను సి.ఎస్. కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది గౌరవ ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. కలెక్టర్ బి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని అన్నారు.

అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను లబ్ధిదారులకు సిఎస్ గారు అందజేశారు. గ్రామసభ సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సిఎస్ కలెక్టర్ గారితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు శ్రీలత, సురేష్, వనజాత, శ్రీలక్ష్మి, లలితా దేవి, తాసిల్దార్, ఎంపీడీవో, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధే... స్వావలంబనకు ముందడుగు





### స్వశక్తితోనే ఏదైనా సాధించగలం

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్

**జవహర్‌నగర్, ఏప్రిల్ 2 (నినాదం):** స్వయం ఉపాదే...స్వావలంబనకు ముందడుగని స్వశక్తితోనే ఏదైనా సాధించగలమని జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని గబ్బిలాల పేటలో స్వయం ఉపాధి నినాదంతో వెంకటేష్ వాటర్ ఫిల్టర్ ప్లాంటును గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ యువత ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా స్వశక్తితో వివిధ మార్గాల ద్వారా స్వయం ఉపాధి మార్గాలను వెతుక్కుని స్వశక్తితో ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు స్వయంకృషితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గబ్బిలాల పేటలో గరీబోల్లే ఎక్కువగా నివసిస్తున్నారని వారికి కనీస అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని దీనికోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని 6 గ్యారంటీ పథకాల తో బాటు పేద ప్రజలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ప్రజల ప్రాథమిక అవసరమైన నీటిని తక్కువ ధరకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో శాఘ వెంకటేష్ ప్రారంభించిన" నీటి శుద్ధికరణ బండాగారాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నీటి శుద్దీకరణ భాండాగార యజమాని శాఘ వెంకటేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు నిలయమైన గబ్బిలాల పేటలో తక్కువ ధరకే త్రాగే మంచి నీటిని సరఫరా చేస్తామని, అలాగే దివ్యాంగులకు, గర్భిణీ స్త్రీలకు, తక్కువ ధరలో నీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మండల సురేందర్, ఆకుల నరసింహ, పందిరి శ్రీనివాసులు, తూటి శ్రీనివాసులు, స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాట్ల వినయ్, మాట్ల శ్రీనివాస్, ఎ. శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రాపర్టీ టాక్స్‌పై ప్రజలకు

## అవగాహన కల్పించండి

### ఏప్రిల్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించండి

### కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత





**జవహర్ నగర్, ఏప్రిల్ 2 (నినాదం):** కీసర సర్కిల్ పరిధిలోని ప్రజలకు ప్రాపర్టీ ట్యాక్స్ పై అవగాహన కల్పించాలని తద్వారా ఏప్రిల్ మాసంలో అనుకున్న లక్ష్యాలను సాధించి ఇంటి పన్నులు పూర్తిగా వసూలు చేయాలని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ వార్డ్ ఆఫీసులో గురువారం రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో గాను ఐదు శాతం రిబేటుతో ఇంటి పన్నులు వసూలు చేయటగాను రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధియే ధ్యేయంగా పనిచేయాలని సిబ్బంది అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ ఇంటి పన్ను వసూళ్ల విషయంలో 100% ప్రగతిని సాధించాలని సూచించారు. ఇందుకోసం ఇంటి పన్ను వసూలులో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఐదు శాతం రిబేటుతో ఇంటి పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు వెంకటేష్, శ్రవణ్, మధుసూదన్ రెడ్డి, నగేష్, రెవెన్యూ టాక్స్ ఇన్స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్‌ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న



**కాప్రా, ఏప్రిల్ 2 (నినాదం) :** బహుజనుల విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్ బీ కాలనీ ఫేజ్-1 ప్రధాన కూడలిలో ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శమని, భారత మాత ముద్దు బిడ్డగా, తెలుగు తొలి బహుజన చక్రవర్తిగా 21 కోటలు నిర్మించి, 30 ఏండ్లు పాలించి, ఏడున్నర నెలల పాటు గోల్కొండను ఏలిన పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటేలా ప్రతి ఏడాది వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య హెచ్ బీ కాలనీ గౌడ సంక్షేమ సంఘం నాయకులు మల్లేష్ గౌడ్, సాయిలు గౌడ్, బాలయ్య గౌడ్, అంజయ్య గౌడ్, ఎట్టయ్య గౌడ్, కృష్ణ గౌడ్, నవీన్ గౌడ్, భూపాల్ గౌడ్, సురేష్ గౌడ్, అశోక్ గౌడ్, ముకేష్ గౌడ్, నరసింహ గౌడ్, చంద్రయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, బీజేపీ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షులు వంజరి ప్రవీణ్ కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, బోదాసు రవి, శేఖర్ గౌడ్, బ్రహ్మాచారి, రామక్రిష్ణ, దండెం నరేందర్ పాల్గొన్నారు.

# ఈసీఈలో శివప్రసాద్‌కు పీహెచ్.డీ.



**పటాన్చెరు, ఏప్రిల్ 02 (నినాదం):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) పరిశోధక విద్యార్థి, గీతం అధ్యాపకుడు వి.శివప్రసాద్ నాయక్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సబ్-6 గిగాహెర్ట్జ్ అనువర్తనాల కోసం సూక్ష్మ, సబ్ స్ట్రేట్-సమాకలిత తరంగమార్గ-ఆధారిత వీ×మీ యాంటెన్నాల నూతన రూపకల్పన, అమలు'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఈఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.మంజునాథాచారి గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ అధ్యయనం సబ్-6 గిగాహెర్ట్జ్ 5జీ అనువర్తనాల కోసం అధిక పనితీరు గల, సూక్ష్మీకరించిన యాంటెనాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. సబ్ స్ట్రేట్ ఇంటిగ్రేటెడ్ వేవ్ గైడ్ (ఎస్ఐడబ్ల్యూ) సాంకేతికత, హాఫ్-మోడ్ (హెచ్ఎంఎస్ఐడబ్ల్యూ), క్వార్టర్-మోడ్ (క్యూఎంఎస్ఐడబ్ల్యూ) వంటి వినూత్న పద్ధతులను ఉపయోగించుకోవడం ద్వారా, గెయిన్, బ్యాండ్ విడ్త్ లో రాజీ పడకుండా యాంటెనా పరిణామాన్ని తగ్గించడం ఈ పరిశోధన లక్ష్మన్నారు. ప్రతిపాదిత మల్టీ-పోర్ట్ వీ×మీ యాంటెనాలు మల్టీ-బ్యాండ్ ఆపరేషన్లకు మద్దతిస్తాయని, అధిక వృద్ధి, విస్తృత బ్యాండ్ విడ్త్, బలమైన పోర్ట్ ఐసోలేషన్, అధిక వైవిధ్యం, చాలా తక్కువ ఎన్వలప్ కోరిలేషన్ తో సహా అద్భుతమైన పనితీరును కనబరుస్తాయని తెలిపారు. మూడు అంతర్జాతీయ జర్నల్స్ లో పరిశోధనా పత్రాలను ప్రచురించడంతో పాటు, స్కోపస్ ఇండెక్స్ చేసిన ఏడు సమావేశ పత్రాలు, ఒక అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పత్ర పురస్కారాలను డాక్టర్ శివప్రసాద్ అందుకున్నట్టు వివరించారు. డాక్టర్ శివప్రసాద్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి తాతినేనిలతో పాటు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వంపై వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే విమర్శలు

- కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్



**సిద్దిపేట,ఏప్రిల్ 02( నినాదం):** తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలు అందిస్తున్న మద్దతును చూసి తట్టుకోలేకే బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమాన్ని ఓర్వలేకే బిఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 10 ఏండ్లు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు కూడా ఇయ్యని వారు, తలాపున మల్లన్న సాగర్ వున్న 10 ఏండ్లు అధికారం చేతిలో ఉన్న ఉప కాలువలు నిర్మించడం లో విఫలం అయిన వారు నీళ్ల గురించి మాట్లాడుతూ వుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు వుందన్నారు. ప్రజా ఆశీర్వాదం తో ఏర్పడిన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ ఒక్కో పథకాన్ని అమలు చేస్తూఅన్ని సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందరికి అందిస్తున్నామని అన్నారు. ప్రతిపక్ష నాయకులు కూడా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారని అన్నారు.

## పిపిసిసి అధ్యక్షుడిని కలిసిన దమ్మని శ్రావణ్‌కుమార్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2 (నినాదం):** టి.పి.సి.సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి 132 డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ల ప్రవీణ్ కుమార్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం చర్చించి పార్టీ బలోపేతం కోసం టిపిసిసి అధ్యక్షులతో తగిన సలహాలు పొందారు.

# రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపులు బంద్

### చేగుంటలో వ్యాపారుల భారీ ర్యాలీ



**చేగుంట, ఏప్రిల్ 2 (నినాదం):** మెదక్ జిల్లా చేగుంట మండలం తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు, గురువారం నాడు రాష్ట్రవ్యాప్తంగా, చికెన్ షాపుల బంద్, విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో గాంధీ స్టాచు వద్ద వ్యాపారులు, షాపులు, మూసివేసి నిరసనలు ర్యాలీ, నిర్వహించారు. పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ వ్యాపారులకు ఇచ్చే మార్జిన్‌ను భారీగా తగ్గించడం వల్ల తాము తీవ్ర నష్టాల్లో ఉన్నామని, దుకాణాల అద్దెలు, కరెంటు బిల్లులు, కార్మికుల జీతాలు, చెల్లించలేక పోతున్నామని, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీకి చేగుంట సర్పంచ్ సంద్రగు స్రవంతి, సతీష్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ, వార్డు సభ్యులు ఆరిఫ్ తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రఫీ మాట్లాడుతూ.. సామాన్యుల ఆహార అలవాట్లలో కీలకమైన చికెన్ విక్రయాలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, కంపెనీల ఏకపక్ష నిర్ణయాల వల్ల చిన్న వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కంపెనీలతో మాట్లాడి వ్యాపారులకు న్యాయమైన మార్జిన్ దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. షాపు యజమాని షకిల్ మాట్లాడుతూ.. రవాణా ఖర్చులు, పెరిగినా కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ పెంచకపోవడం అన్యాయమని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు మహమ్మద్ సలీం మహమ్మద్ కలీం, హామీద్, కటిక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



**అమీన్‌పూర్, ఏప్రిల్ 2(నినాదం):** అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ సనాతన ధర్మాన్ని ఆచరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.. భారతీయ పురాణాలలో అపారమైన భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీకగా నిలిచిన హనుమంతుని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అన్నారు. నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బావోజి జాతరకు కాలినడక ప్రయాణం

### పదేళ్ళ నుండి పాదయాత్రగా ఆనవాయితీ



**కొడంగల్, ఏప్రిల్02(నినాదం):** నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో జరిగే గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు శ్రీగురు లోకమసంద్ జాతరకు బొంరాస్ పేట్ మండలంలోని బాపల్లితాండ నుంచి గిరిజన యువకులు గురువారం పాదయాత్రగా బయలు దేరారు. పదేళ్ల నుంచి పాదయాత్రగా వెళ్ళడంను ఆనవాయితీగా కొనసాగిస్తున్నట్లు యువకులు తెలిపారు. ఈ పాదయాత్రలో గిరిజన యువకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతి రెడ్డి పాల్గొని కొంతదూరం నడిచివెళ్ళడంతో యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గిరిజన యువకులు సంతోష్ నాయక్, చత్రు రాథోడ్, మాస్టర్ నాయక్, హరి నాయక్, వెంకట్, ప్రకాష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలి

### యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట,ఏప్రిల్ 02( నినాదం):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలో శ్రీ పెద్దమ్మ పులి విక్రమ మహారాజుల కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు హాజరైన యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి కి ముదిరాజ్ సంఘం సభ్యులు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానుని పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకు నిరంతరం సేవ చేసే భాగ్యం కల్పించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి అభివృద్ధి కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. వార్షికోత్సవ వేడుకలకు రూ..10,000 వేల రూపాయలు నగదు విరాళాన్ని అందజేశారు.

# నా ప్రాణం పోయినా డంపింగ్‌యార్డ్ రానివ్వను

ఏప్రిల్ 7, 8 తేదీల్లో దీక్షకు సిద్ధం
రాజకీయాలకు అతీతంగా ఉద్యమిద్దాం..
నేటి బంద్‌ను విజయవంతం చేయండి
ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ప్రకటనను
వెంటనే వెనక్కు తీసుకోవాలి
హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
డంపింగ్ యార్డ్ ప్రతిపాదన స్థలాన్ని
పరిశీలించిన ఎమ్మెల్యే





**జమ్మికుంట,ఏప్రిల్2(నినాదం):** తాను బతికుండగా ఎట్టిపరిస్థితుల్లోనూ డంపింగ్‌యార్డ్ పెట్టనిచ్చే ప్రసక్తి లేదని, ఎంతవరకైనా పోరాటానికి సిద్ధమని, ప్రభుత్వవెంటనే డంపింగ్‌యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా డంపింగ్ యార్డ్ పై ఉద్యమించాలని, ఈనెల 3న జరిగే హుజురాబాద్ బంద్ విజయవంతం చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిర్సపల్లి సమీపంలోని డంపింగ్‌యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నేతలతో కలిసి పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డ్ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని, ఇది ప్రజలజీవిత సమస్య అని, నిజంగానే ఇక్కడ డంపింగ్‌యార్డ్ ఏర్పాటయితే ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టమవుతుందని, రైతులు మహిళలు పిల్లలు ఇబ్బందులు పడతారని, పశుపక్షాదుల ఉనికి సైతం ప్రశ్నార్థకమవుతుందని పర్యావరణం దెబ్బతింటుందని, ప్రజలు ముక్తకంఠంతో డంపింగ్ యార్డ్ వద్దని కోరుకుంటున్నారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కి డంపింగ్ యార్డ్ వద్దని, హుజురాబాద్ ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని దండం పెట్టిచెప్పానని ఆయన తెలిపారు. 'నాపైకోపం ఉంటే నన్ను ఉరితీయండి..జైలుకు పంపండి..కానీ నానియో జకవర్గ ప్రజలను ఇబ్బంది పెట్టద్దు.. హుజురా బాద్ గడ్డ పోరాటాల అడ్డ.. నాడు తెలంగాణ రాష్ట్ర సాధనలో హుజురాబాద్ కమలాపూర్ ప్రాంతం కీలకపాత్ర పోషించింది..ఈ ప్రాంతానికి పోరాటాలు కొత్త కాదు" అని ఆయన ఉద్వేగంగా అన్నారు. డంపింగ్ యార్డ్ వ్యవహారంలో ఎవరు బురద చల్లేందుకు ప్రయత్నించవద్దని, స్వయంగా ముఖ్యమంత్రి డంపింగ్ యార్డ్ ను ప్రతిపాదించారని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఆయన ఈ సందర్భంగా చదివి వినిపించారు.డంపింగ్ యార్డ్ రద్దువిషయంపై తాను ముఖ్యమంత్రికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు లేఖలు ఇప్పటికే రాసినట్టు ఆయన వివరించారు.

**7, 8 తేదీల్లో దీక్ష చేస్తా : కౌశిక్ రెడ్డి**

డంపింగ్ యార్డ్ హుజురాబాద్ ప్రజలందరి జీవన్మరణ సమస్య అని, ఒకవేళ ప్రభుత్వం ప్రకటనను వెనక్కి తీసుకోకపోతే, డంపింగ్ యార్డ్ ను రద్దు చేయకపోతే తాను ఈ నెల 7, 8 తేదీలలో స్వయంగా జేఏసీ శిబిరంలో దీక్షలో పాల్గొంటానని, 7 న ఉదయం 7 గంటల నుండి 7 వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు దీక్ష చేస్తానని అయన వెల్లడించారు.ఆలోపే ప్రభుత్వం నుండి అనుకూలమైన ప్రకటన వస్తుందని ఆశిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

**3 న బంద్ విజయవంతం చేయండి**

బందును అడ్డుకోవాలని పోలీసుఅధికారులు ప్రయత్నం చేయవద్దని, పోలీసులు వందలాది మంది ఉంటే హుజురాబాద్‌లో లక్షమంది ప్రజలు ఉన్నారని, ప్రజా పోరాటాన్ని ఎవరు ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. హుజురాబాద్లో మూడో తేదీన బంద్ శాంతియుతంగా జరుగుతుందని బంద్ విషయాన్ని పోలీసు అధికారులతో కూడా చర్చించి సహకరించాలని కోరానని, డంపింగ్ యార్డ్ ఏర్పాటయితే పోలీసులకు కూడా ఇబ్బంది జరుగుతుందని ఆయన అన్నారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ బిజెపి సిపిఐ సిపిఎంతోపాటు అన్ని పార్టీలు స్వచ్ఛంద సంస్థలు అన్ని వర్గాలు బందులో పాల్గొనాలని, ప్రజలు డంపింగ్ యార్డ్ అంశంపై సీరియస్‌గా ఉన్నారన్న సంకేతం ప్రభుత్వానికి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.హుజురాబాద్ బంద్ విషయమై ఇప్పటికే వ్యాపార వర్గాలతో తాను చర్చించానని, అత్యవసర సేవలైన దవాఖానాలు మెడికల్ షాపులు తప్ప మిగతావి అన్ని బంద్ పాటించాలని,అందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజానికి 4న బంద్ పట్టిద్దామని అనుకున్నామని కానీ తనను సిఐడి విచారణకు హాజరుకావాలని చెప్పినందున చట్టాన్ని గౌరవించే ఉద్దేశంతో తాను 3న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**టెండర్లు వేయొద్దు**

డంపింగ్‌యార్డ్ కం ఎనర్జీ ప్లాంట్ కాంట్రాక్ట్ పనులకు ఏవీ కూడా టెండర్ వేయ్యొద్దని, వేస్తే తప్పకుండా అడ్డుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ జవహర్ నగర్ లోనూ ఇలాగే ప్లాంట్ పెడితే ప్రస్తుతం అక్కడ జనాలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని స్వయంగా అందరూ చూస్తున్నారని, ఎమ్మెల్యే మల్లారెడ్డి కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులు చెప్పారని, అక్కడ ప్రస్తుతం ఏమీ చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామసభలు

నగునూరులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక
గ్రామసభలో కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, ఏప్రిల్ 2(నినాదం )** కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొంటూ, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అమలవుతున్న పథకాల వివరాలను అధికారులు గ్రామసభల ద్వారా ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు భరోసా, సన్న బియ్యం, పింఛన్లు వంటి పథకాల లబ్ధిదారుల వివరాలు గ్రామసభల్లో వెల్లడిస్తారని తెలిపారు. పథకాల అమలులో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామసభ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, తహసీల్దార్ నర్సింగరావు, సర్పంచ్ శ్రావణి తదితర అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా కోరపల్లి గ్రామసభ...

అధికారులు హాజరైన కనిపించని ప్రజలు..



**జమ్మికుంట,ఏప్రిల్2 (నినాదం):**జమ్మికుంట మండలంలోని కోరపల్లిలో ప్రజా పాలనలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభ ప్రజలు లేకపోవ డంతో తూతూ మంత్రంగా నిలిచిపోయింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి సమస్యలు తెలుసుకునేందుకు అధికారులతో పెద్ద మొత్తంలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. అందులో భాగంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లిలో గ్రామ సభ నిర్వహించగా ప్రజల కంటే కూడా అధికారులే ఎక్కువగా ఉండడంతో సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలు ఎవరు రాకపోవడంతో గ్రామసభ తూతూ మంత్రంగా సాగింది. సుమారు 3000 జనాభా కలిగిన కోరపల్లి గ్రామంలో పట్టుమని 10 మంది కూడా గ్రామ సభకు రాకపోవడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. గ్రామ సభ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరగాల్సి ఉండగా సభ ప్రారంభంలో సర్పంచ్ గైరాహాజరు కావడంతో వచ్చిన అధికారులే సభను నిర్వహించారు. సభ ముగిస్తుందన్న తరుణంలో సర్పంచ్ హాజరయ్యారని స్థానికంగా ఉన్న ప్రజలు తెలిపారు. వచ్చిన అధికారులు సైతం కోరపల్లి గ్రామంలో అసలు సమస్యలే లేవా అనే విధంగా ఆలోచనలో పడ్డారు.

# మున్సిపల్ బడ్జెట్ 34 కోట్ల 70 లక్షలు

బడ్జెట్ కు ఆమోదం తెలిపిన పాలకవర్గం



**జమ్మికుంట, ఏప్రిల్ 2 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన 34 కోట్ల 70 లక్షల బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో 2026- 27 ఆర్థిక సంవత్సరం క్యాపిటల్ గ్రాండ్ 24 కోట్ల 69 లక్షలు, 2026-27 ఆర్థిక సంవత్సరం జనరల్ ఫండ్ ఆదాయం 9 కోట్ల 64లక్షలు, మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల జీతాలు ఆదాయ, వ్యయాలు వంటి పలు అంశాలను పొందుపరచగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, మున్సి పల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, రాజ్ కుమార్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్ లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

# పాపన్నగౌడ్‌కు కలెక్టర్ ఘన నివాళి



**కరీంనగర్, ఏప్రిల్ 2(నినాదం):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆయనకు ఘన నివాళులర్పించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి స్మరించారు.ఈ సందర్భంగా పాపన్న గౌడ్ సమాజానికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన ధైర్యసాహసాలు మరియు నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, డీఎస్పీ శ్రీనివాస్ గౌడ్, కలెక్టరేట్ ఏవో సుధాకర్‌తో పాటు అధికారులు, గౌడ సంఘం నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

# పాపన్నగౌడ్ స్మృతికి నివాళులు

విగ్రహానికి పూలమాల వేసిన డిప్యూటీ మేయర్



**కరీంనగర్, ఏప్రిల్ 2(నినాదం):** బహుజన చక్రవర్తి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా నగరంలోని రేకుర్తి బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా 19వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవి-కృష్ణ గౌడ్, 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ళ జయశ్రీ-శ్రీనివాస్, స్థానిక నాయకులు, వివిధ కులసంఘాల ప్రతినిధులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాపన్న గౌడ్ స్మృతికి నివాళులు అర్పించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు విశేష స్పందన

వార్డు సభల ద్వారా ప్రజా సమస్యల స్వీకరణ
మౌలిక సదుపాయాల మెరుగుపై అధికారుల హామీ
మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, ఏప్రిల్ 2(నినాదం ):** ప్రభుత్వ పాలనను ప్రజల గుమ్మం వద్దకు చేర్చే లక్ష్యంతో కరీంనగర్ నగర పాలక సంస్థ చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నగరవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగింది. వివిధ డివిజన్లలో నిర్వహించిన వార్డు సభలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేశారు. 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సభకు మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. అనంతరం 43వ డివిజన్ గోదాంగడ్డలో జరిగిన సభకు మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హాజరై పలు సమస్యలపై దరఖాస్తులు తీసుకున్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులు, కాలువల నిర్వహణ వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, లబ్ధిదారుల సమాచారం సభల్లో తెలియజేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం లక్ష్యమని, ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి గడపకు ప్రభుత్వ సేవలు చేరేలా కృషి చేస్తామని అన్నారు.డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ యువత, మహిళల భాగస్వామ్యం అభివృద్ధికి కీలకమని, ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ వార్డు సభల ద్వారా ప్రజల సమస్యలను సేకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం కూడా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు మర్చిపోయే రోజులు పోయాయి...

# అమలు చేస్తాం:

మంత్రి అడ్లూరి



**ధర్మపురి, ఏప్రిల్ 2( నినాదం):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం కావని, వాటిని కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని కోరండ్లపల్లిలో గురువారం నూతన రేషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ...రాష్ట్ర ఆర్థికపరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ ప్రజ లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ధ్యేయమ న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో కోరండ్లపల్లిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు.గతప్రభుత్వంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు.గ్రామంలో కరెంట్ పోల్స్ సమస్య పరిష్కారం, పోచమ్మ గుడికి దారి అభివృద్ధి, మున్నూరు కాపు సంఘ భవనానికి నిధుల విడుదల వంటి పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అర్హులైన వారికిరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ శర్మ , ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అచీవర్స్ స్కూల్‌లో ఘనంగా

# ప్రీ-ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకలు

విద్యార్థుల ప్రతిభకు మెడల్స్, సర్టిఫికెట్లు తల్లిదండ్రుల సమక్షంలో సందడి



**కరీంనగర్, ఏప్రిల్ 2(నినాదం):**స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సి. హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి. హెచ్. పల్లవి, ముఖ్యఅతిథి వేణుగోపాల్ రెడ్డి సంయుక్తంగా దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, పద్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ, ప్రతి సంవత్సరం ప్రీ-ప్రైమరీ నుంచి ప్రాథమిక దశకు వెళ్తున్న విద్యార్థుల కోసం ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలి పారు. ఇది విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంపొందిం చడం లో సహాయపడుతుందని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ పల్లవి మాట్లా డుతూ, చిన్న వయస్సు నుంచే విద్యపై దృష్టి సారించి లక్ష్యాలను ఏర్పరచుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.ముఖ్యఅతిథి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో జిజ్ఞాస ,పోటీతత్వం పెంచుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్
హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు



**జమ్మికుంట, ఏప్రిల్ 2 (నినాదం):** హనుమాన్ జయంతి సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని సంజీవనీ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ సంజీవని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న చైర్మన్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పట్టణ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, భక్తులతో కలిసి మాట్లాడి, హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి రాము, నేదూరి సమ్మయ్య,చరణ్, సదానందం, సమ్మయ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభలు

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు: మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్..



**జమ్మికుంట, ఏప్రిల్2 (నినాదం):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వార్డులలో వార్డు సభలను నిర్వహించారు.అందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ 22,23, 24 వార్డులకు సంబంధించిన వార్డు సభను స్థానిక ఆర్థిదారుల సంఘం కార్యాలయంలో నిర్వహించారు.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే మాలక్ష్యం అని అన్నారు. ఇంకా ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి మాకు తెలుపాలని ప్రతి ఒకరు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి వారికి లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రజలతో పాటు అధికారులు కౌన్సిలర్లు రమాదేవి ప్రణీత పాల్గొన్నారు.

**30 వార్డుల్లో వార్డు సభలు హాజరైన అధికారులు ప్రజలు**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వార్డ్ సభలను ఏర్పాటు చేశారు. ఈ సభలలో స్థానిక కౌన్సిలర్లు పాల్గొని వార్డు ప్రజలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, పరిసరాల పరిశుభ్రత, సీసీ రోడ్లు, తో పాటు అనేక అంశాలకు సంబంధించిన విషయాలను గురించి ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు వార్డులలో ఉన్న సమస్యలను కౌన్సిలర్లకు తెలియజేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్లు రానివారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తామని కౌన్సిలర్లు హామీ ఇచ్చారు. ఏ విధంగా డబల్ బెడ్‌రూమ్‌కు అర్హత కలిగిన నిరుపేదలందరూ దరఖాస్తు చేసుకోవాలని నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# బండి సంజయ్ పేరు దుర్వినియోగంపై హెచ్చరిక

అక్రమ కార్యకలాపాలపై వెంటనే
ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచన



**కరీంనగర్,ఏప్రిల్2(నినాదం):**కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తన పేరు చెప్పుకొని కబ్జాలు లేదా అక్రమ కార్య కలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.ఎవరైనా తన పేరును ఉపయోగించి పంచాయతీలు లేదా సెటి ల్మెంట్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలకు సేవ చేస్తూ పార్టీకి మంచి పేరు తీసుకొచ్చే వారిని ప్రోత్సహిస్తానని, ప్రజలను వేధించే వారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షిం చబోనని తెలిపారు.తనపేరు చెప్పి ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే ఎంపీ కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



**జమ్మికుంట,ఏప్రిల్2 (నినాదం):**జమ్మికుంట ప్రభుత్వడిగ్రీ పీజి కళాశాలలో పనిచేస్తున్న వృక్షశాస్త్ర అధ్యాపకులు సి.రాజకుమార్ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం నుండి డాక్టరేట్ ను అందుకున్నారు. కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న రాజకుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవి ద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ టి.విజయ పర్యవేక్షణలో "ఎవాల్యూ ఏటింగ్ ది ఎఫెక్ట్ ఆఫ్ బయోఇనాక్యులెంట్స్ ఆన్ గ్రోత్ అండ్ ఈల్డ్ ఆఫ్ సెన్నా అలెగ్జాండ్రిన మిల్.ఆన్ ఇంపార్టెంట్ మెడిసినల్ ప్లాంట్ " అనే అంశం పై పరిశోధన గ్రంథం సమర్పించారు.ఈమేరకువిశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫె సర్ బి.రాజ మాణిక్యం రాజకుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తూ ఉత్తర్వులు జారిచేశారు. దీంతో డాక్టర్ సి.రాజకుమార్‌ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.రమేష్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.

ఓటర్ల జాబితా

# ప్రక్షాళన పేరిట గందరగోళం!

బీఎల్‌ఓలు గల్లంతు... పేర్లు మాయం..!.
అధికారుల నిర్లక్ష్యం
వివరణ అడిగితే తహసిల్దార్
తప్పించుకునే ధోరణి...!




**మెట్‌పల్లి, ఏప్రిల్2 (నినాదం):** మెట్‌పల్లి పట్టణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాల్సిన బీఎల్‌ఓలు చాలా ప్రాంతాల్లో కనిపించకపోవ డంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతుండగా, అనర్హుల పేర్లు కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది.కొన్ని చోట్ల ఒకే కుటుంబంలో కొందరి పేర్లు ఉండగా, మరికొందరి పేర్లు లేకపోవడం గమనార్హం. ఈ విషయంపై ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, బీఎల్‌ఓల పనితీరుపై వివరణ కోరుతూ మెట్‌పల్లి తహసిల్దార్‌ను చరవాణి ద్వారా సంప్రదించగా, ఆమె నుంచి స్పష్టత కంటే తప్పించుకునే సమాధానాలే వినిపించాయని సమాచారం. బాధ్యతాయుతంగా స్పందించాల్సిన స్థాయిలో ఉండి కూడా ప్రశ్నలకు నేరుగా సమాధానం ఇవ్వకుండా మాట మార్చడం, స్పష్టత ఇవ్వకుండానే చేతులు దులుపుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన అధికార యంత్రాంగమే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీఎల్‌ఓల పనితీరును సమీక్షించి, సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రానున్న రోజుల్లో ఈ అంశంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం హెచ్చరిక



**కరీంనగర్, ఏప్రిల్ 2(నినాదం ):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలను భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచు కుని నియమ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని పేర్కొ న్నారు. సంబంధిత సహాయ పోలీస్ కమి షనర్ల అనుమతి లేకుండా సభలు, సమావే శాలు, ర్యాలీలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి తీసు కుంటే కార్యక్రమాలకు తగినభద్రతా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.ఈ ఆదేశాల ప్రకారం ఆయుధాలు లేదా ఇతరులకు హాని కలిగించే వస్తువులతో సంచరించడం నిషేధం. అలాగే రోడ్లు, ప్రజా స్థలాల్లో గుంపులుగా చేరడం, శబ్ద కాలుష్యానికి కారణమ య్యే సంగీతం, ప్రసంగాలు నిర్వహించడం అనుమతించబ దదు.ఈ ఉత్తర్వులు ఈనెల 30వతేదీ వరకు అమల్లో ఉంటా యని, వాటిని ఉల్లంఘించే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

# మాలపల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ



**హుస్నాబాద్,ఏప్రిల్2 (నినాదం):** హుస్నాబాద్ మండలం మాలపల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధిపై చర్చించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం మెరుగుపరచడం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని వివరించారు.ప్రజల నుండి అందిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామనిప్రతినిధులు తెలిపారు. గ్రామస్తులు తమ వినతులను అధికారులకు సమర్పించగా, అర్హులైన ప్రతిఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామకార్యదర్శి, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేర రహిత సమాజమే లక్ష్యం : ఏసీపీ సదానందం



**హుస్నాబాద్,ఏప్రిల్2 (నినాదం):** హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో ప్రతిష్టాత్మకగా చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేకగ్రామ సభకు విశేష స్పందన లభించింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం గ్రామస్తులను ఉద్దే శించి ప్రసంగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ ,సామాజిక బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఆరోగ్యవంతమైన, నేర రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతిఒక్కరి పాత్ర కీలకమని ఆయన చెప్పారు.ముఖ్యంగా ప్రస్తుత కాలంలో యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి అలవాట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు ఎలా చిన్నాభిన్నమవుతాయో వివరిస్తూ, వాటి నిర్మూలనకు పోలీసులతో సహకరించాలని కోరారు.అలాగే సమాజానికి శాపంగా మారిన భ్రూణ హత్యల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం తప్పనిసరని, ప్రాణ రక్షణకు హెల్మెట్ మరియు సీటు బెల్టు ధరించడం బాధ్యతగా గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో భద్రతను పటిష్టం చేయడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'వంద మంది పోలీసులు చేసే పనిని ఒక్క సీసీ కెమెరా చేస్తుంది' అని పేర్కొంటూ, నేరాల అదుపునకు ప్రతి వీధిలో కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. ఆధునిక కాలంలో పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలవుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేసిన ఏసీపీ, తల్లి దండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి భవిష్యత్తును తీర్చిది ద్దడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలు సంపత్, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, నోడల్ ఆఫీసర్ ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని తెలిపారు.

# గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

## గ్రామసభలో పలు నిర్ణయాలు... పథకాల అమలుపై అధికారులకు ఆదేశాలు: మంత్రి అడ్లూరి







**ధర్మపురి ఏప్రిల్ 2(నినాదం)**

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అర్హులందరికీ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు

**నిధుల వెల్లువ – గ్రామానికి లబ్ధి ఎంత?**

గత రెండు సంవత్సరాల్లో నేరెళ్ల గ్రామానికి రూ.134.90 కోట్ల నిధులు వివిధ సంక్షేమ పథకాల ద్వారా విడుదల చేసామని మంత్రి తెలిపారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతోందన్నారు.

**విద్యకు ప్రాధాన్యం... కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల కోసం ఉదయం టిఫిన్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

**కొత్తగా "జీవిత బీమా" పథకం**

కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు "ఇందిరమ్మ జీవిత ప్రమాద బీమా" పథకాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

**రూ.200 కోట్ల మెగా స్కూల్**

నేరెళ్లలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్" నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించామని , గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచాలి**

గ్రామాల్లో పట్టణ కేంద్రాల్లో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలలలోనే పిల్లలను చేర్పించాలని గ్రామీణ ప్రజలకు మంత్రి సూచించారు. గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను క్రమబద్ధంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ శర్మ , డీఆర్డీఓ రఘువరన్, ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్, నేరెళ్ల సర్పంచ్ బాల గౌడ్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

## సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 2 (నినాదం):**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.గురువారం అయన నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రంలో రైతు వేదిక ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .రానున్న మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు,సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తామని, అందుకే ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో 60 లక్షలతో సిసి రోడ్లు నిర్మించడం జరిగిందని, మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తున్నామని, 6 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాల మంజూరు చేసామని, 26 కోట్ల రూపాయలతో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి జీవో త్వరలో రానుందని, 15 రోజుల్లో టెండర్లు పిలిచి అన్ని సేవలు అందించేలా పీహెచ్సీ ని తీర్చిదిద్దుతామని, అలాగే కనగల్ లో సైతం పిహెచ్ సి ని మంజూరు చేసినట్లు చెప్పారు. మండలంలో గతంలో 100 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, నిధులు లేనందున మధ్యలో నిర్మాణాలు ఆగి పోయాయని, వాటికి నిధులు మంజూరు చేయిస్తామని, నెల రోజుల్లో గృహప్రవేశాలకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. 100 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహప్రవేశాల కోసం తన సొంతంగా ప్రతి ఇంటికి 20వేల రూపాయలు ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వీటితోపాటు, ఇదివరకే 130 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చామన్నారు.మండలంలో గ్రామ సమాఖ్య భవనాలను నిర్మిస్తున్నామని ,సిసి రోడ్లు, డ్రైనేజీలతో పాటు ,సాగునీరు అందించే కాలువల మరమ్మతులకు మూడున్నర కోట్ల రూపాయలు వెచ్చించి లైనింగ్ చేపట్టామని, మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనం పాతబడిపోయినందున 70 లక్షల రూపాయల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని చూడాల్సిందిగా ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మండలంలో 100 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూములు ఇండ్లు ఇవ్వగా గతంలో నిధుల చెల్లింపుతో ఆగిపోయాయని ,మంత్రి ఆదేశంతో తక్కిన నిధులను వెచ్చించి త్వరగా నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికంగా సర్పంచుల వ్యవస్థ చాలా ముఖ్యమని అన్నారు. పేద కుటుంబాలకు ,అర్హులైన లబ్దిదారులందరికీ ప్రభుత్వ లబ్ధి అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ రజిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, ఎల్పిజి తదితర పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారులు వారు పొందిన లబ్ధిని తెలియజేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# పటాన్‌చెరులో ఉద్రిక్తత

## కాట శ్రీనివాస్ గౌడ్ నివాసం వద్ద పోలీసుల ముట్టడి





**పటాన్చెరు, ఏప్రిల్ 2 (నినాదం)**

పటాన్‌చెరు నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నిన్న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చేసిన సవాల్ ప్రకారం ఈ రోజు బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన కాట శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయన నివాసం వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, ఇంటిని ముట్టడించారు.
కాట శ్రీనివాస్ గౌడ్ శివాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు ముందుగానే అడ్డుకోవడంతో పరిస్థితి రణరంగంగా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు మరియు పోలీసుల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. చర్చకు వెళ్లకుండా తమను గృహనిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని కాట శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**గద్వాల బ్యూరో ఏప్రిల్ 2 (నినాదం)**



జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్.ఆర్.ఎస్(ఫేస్ రికగ్నైజ్ సిస్టం) హాజరు విధానం సక్రమంగా నిర్వహించకపోవడం వలన 76 మంది విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు నమోదుపై సమగ్రంగా పరిశీలించగా, పలుచోట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎఫ్.ఆర్.ఎస్ యాప్‌లో హాజరు సక్రమంగా నమోదు చేయకపోవడం గమనించారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ జిల్లా పరిధిలోని 61 పాఠశాలలకు చెందిన 76 మంది బోధన మరియు బోధనేతర సిబ్బందిపై చర్యలు తీసుకుంటూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. సంబంధిత సిబ్బంది తమ సంజాయిషీని మూడు రోజుల లోపు సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను కచ్చితంగా పాటించడంతో పాటు, ప్రతి రోజూ ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా హాజరును తప్పనిసరిగా సమయానికి నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

# అడవి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్

## డెకాయిట్ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిట్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు.ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు–నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది.

NINADAM CINEMA

# తెలుగులో తొలి ఏఐ చిత్రం

## అంబ ద రివెంజ్

తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.



# రామాయణ టీజర్ విడుదల



రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000 కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. '




# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్



విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్ లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్–రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి.

# వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?



దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగుతోంది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787